**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 97003 70499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 97003 70499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 31-05-2025 | సంపుటి : 11 | సంచిక : 127 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## ఏపీలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి



ఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఐఐ సదస్సులు నిర్వహించానని, తాను మొదటి నుంచీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చాయని పేర్కొన్నారు. దావోస్‌లో ఏటా పారిశ్రామికవేత్తల సదస్సు జరుగుతుందని, అక్కడికి వెళ్లొద్దని కొందరు తనకు సూచించారని చంద్రబాబు తెలిపారు. అక్కడ ప్రముఖులతో సంబంధాల దృష్ట్యా పేదలు ఓట్లు వేయరని చెప్పారని గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రధాని కూడా దావోస్ వెళ్లలేదని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. 1995 నుంచి తాను మాత్రమే దావోస్‌కు తరచూ వెళ్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. సంపద సృష్టి జరగాలని, అది పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు. సంపద సృష్టి ద్వారానే పేదల ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా సీఐఐ సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఏపీ అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై ప్రసంగించారు. ఆదాయం పెరిగితే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని వెల్లడించారు. సరైన సమయంలో దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారని ప్రశంసించారు. భారత్‌కు మోదీ నాయకత్వం ప్రధాన బలమని కొనియాడారు. చైనా ఆర్థిక వ్యవస్థ భారత్‌కు నాలుగున్నర రెట్లు, అలాగే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఏడు రెట్లు ఎక్కువని వివరించారు సీఎం చంద్రబాబు. సరైన పాలసీలు రూపొందిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేశానికి రానున్న పదేళ్లు అత్యంత కీలకమని అన్నారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని అభివర్ణించారు. ఐటీ పరిశ్రమల వల్లే హైదరాబాద్‌కు లబ్ధి జరిగిందని స్పష్టం చేశారు. 2047 విజన్ లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని వివరించారు. సాంకేతిక విప్లవంలో చాలా మార్పులు వచ్చాయని, ఏపీలో 15 శాతం వృద్ధి రేటు తన లక్ష్యమని వెల్లడించారు. అమరావతిలో దేశంలోనే తొలిసారి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయబోతున్నామని, విశాఖపట్నానికి టీసీఎస్, గూగుల్, మిట్టల్ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు సీఎం చంద్రబాబు. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు సీఎం చంద్రబాబు. ఏడాదిలోనే ఏపీలో రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులతో 4.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. పారిశ్రామికవేత్తలను ఏపీకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఏపీలో పలు రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. ఏపీలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని ఆయన ఆకాంక్షించారు. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగా ఉపయోగించుకోవాలని.. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లదే నేడు కీలకపాత్ర అని వివరించారు. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలేనని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## పాక్‌కు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్



పాట్నా, మే 30: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తామని బిహార్ పర్యటనలో భాగంగా ఈ గడ్డపై నుంచి గతంలో తాను ఇచ్చిన హామీ నెరవేర్చానని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బిహార్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆయన కరకట్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాముడు ఒక్కసారి మాట ఇచ్చారంటే.. దానికి కట్టుబడి ఉంటారన్నారు. అదే విధానాన్ని తాము అనుసరిస్తున్నట్లు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన రెండో రోజు అంటే మే 24వ తేదీ ప్రధాని మోదీ బిహార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేస్తామంటూ బిహార్‌లోని మధుబన్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోదీ ప్రకటించారు. నాడు ఇచ్చిన మాటకు కట్టుబడి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ వాగ్దానం చేసిన 35 రోజులకు మళ్లీ తాను బిహార్‌కు వచ్చానని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. మన మహిళ సిందూరం శక్తి ఎలా ఉంటుందో పాకిస్థాన్ చూసిందని అన్నారు. పాకిస్థాన్ ఆర్మీ తమకు రక్షణగా ఉందని ఉగ్రవాదులు భావిస్తున్నారని తెలిపారు. వారికి సైతం భారత్ దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూపించామని చెప్పారు. అంతేకాదు.. పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టామని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇది నయా భారత్ శక్తి అంటూ ప్రధాని మోదీ అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు భారత్ శక్తి బాగా అర్థమైందన్నారు. అయితే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ జరుపుతోన్న పోరు ఆగలేదని స్పష్టం చేశారు. మరోసారి ఈ తరహా దాడి జరిగితే మాత్రం పాము తలను నాశనం చేస్తామని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాకిస్థాన్‌ను ప్రధాని మోదీ పరోక్షంగా హెచ్చరించారు. మరికొద్ది నెలల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో వరుసగా మరోసారి అధికారం చేజిక్కించుకోవాలని ఎన్డీయే కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. జేడీ యూ అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 80 స్థానాలను గెలుచుకుని అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఇవే ఎన్నికల్లో జేడీయూ 45 స్థానాలకు కైవసం చేసుకుంది. మిత్ర ధర్మంలో భాగంగా సీఎం పదవి నితీశ్ కుమార్ చేపట్టారు. అదీకాక.. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 29 స్థానాలను ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న విషయం విదితమే.

## గిరిజనుల సమస్య తీరిందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అల్లూరి సీతారామరాజు జిల్లా: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు అల్లూరి జిల్లా లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రహదారిని నిర్మించినట్లు పవన్ తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రూ. 87.19 లక్షల వ్యయంతో 1.01కి.మీ. రహదారిని నిర్మించినట్లు ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. గిరిజన గ్రామాలు, ఖుఱు ప్రాంతాలకు రహదారులు నిర్మించాలనే ఉద్దేశ్యంతో కేంద్రం చేపట్టిన ఖఓఎంఔఓంఔ పథకంలో భాగంగా ఈ రహదారిని నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా దాదాపు 183 మంది గిరిజనులకు రహదారి సమస్య పరిష్కారం అయ్యిందని పవన్ వెల్లడించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని పవన్ చెప్పారు. అందులో భాగంగా రూ. 1000 కోట్ల నిధులతో అడవి తల్లి బాట కార్యక్రమం చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గిరిజనులను అభివృద్ధికి చేరువ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

## దేశ వ్యాప్తంగా విజృంభిస్తోన్న కరోనా.. 1828కి పెరిగిన కేసులు..

కరోనా ప్రపంచాన్ని మరోసారి అతలాకుతలం చేస్తోంది. అమెరికా, సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్ దేశాలలో ఇప్పటికే పలు ఆసుపత్రులు కరోనా కేసులతో నిండిపోయాయి. క్రమంగా భారతదేశంలో కూడా కరోనా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దేశంలో 1,828 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. 15 మంది కరోనాతో మృతి చెందారు. అందులో ఆరుగురు మహారాష్ట్రకు చెందిన వారు ఉన్నారు. గుజరాత్‌లో గురువారం ఆరు కొత్త కేసులు నమోదయ్యాయి. వారిలో 8 నెలల శిశువు కూడా ఉంది. ప్రస్తుతం ఆ శిశువు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.

## లిక్కర్ స్కాంలో నిందితుల విచారణ.. సిట్ ప్రశ్నలు ఇవే




విజయవాడ, మే 30: ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాంలో నిందితుల విచారణ కొనసాగుతోంది. ఏసీబీ కోర్టు అనుమతితో లిక్కర్ స్కాంలో నలుగురు నిందితులను ఈరోజు (శనివారం) ఉదయం సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. నలుగురు నిందితులను సిట్ చీఫ్ రాజశేఖర్ బాబు నేరుగా విచారించారు. దాదాపు ఐదు గంటలుగా విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితు ఏ1 రాజ్ కసిరెడ్డితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను సిట్ చీఫ్ విచారించారు. స్కాంలో ఈ నలుగురి పాత్ర కీలకంగా ఉందని ఇప్పటికే సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. కస్టడీలో భాగంగా స్కాంలో వసూలు చేసిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు, ఎక్కడ ఖరీదైన ఆస్తులు కొన్నారని నిందితులను సిట్ చీఫ్ ప్రశ్నించారు. ఖరీదైన కార్లు ఎవరి కోసం కొన్నారని ప్రశ్నలు సంధించారు. అలాగే నిందితుల కుటుంబ సభ్యుల వ్యాపారాల్లో పెట్టుబడులుగా వచ్చిన డబ్బుల గురించి బ్యాంక్ అకౌంట్స్ ఆధారంగా నిందితులను ప్రశ్నించారు సిట్ చీఫ్. 2019 – 2024 సమయంలో నిందితులు కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రార్ శాఖ నుంచి సిట్ సేకరించింది. దీంతో ఈ ఆస్తుల వివరాలపై నిందితులను సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. లిక్కర్ కేసులో సిట్ అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని సిట్ అరెస్ట్ చేసింది. వారిలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి సూత్రధారి, పాత్రధారిగా ఉన్నట్లు సిట్ గుర్తించింది. ఆయన తరువాత అరెస్ట్ చేసిన సజ్జల శ్రీధర్ రెడ్డి, చాణుక్య, దిలీప్ పాత్ర కొంత మేరే అని సిట్ విచారణలో బయటపడింది. అయితే ముందుగా కసిరెడ్డిని అరెస్ట్ చేసి విచారించగా.. అతడు ఇచ్చిన సమాచారం మేరకు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప పాత్రలు కూడా కీలకం అని గుర్తించి.. వారిని ఇటీవలే అరెస్ట్ చేశారు. దీంతో కసిరెడ్డితో పాటు వీరు ముగ్గిరినీ కస్టడీకి ఇస్తే మరింత సమాచారం సేకరించే అవకాశం ఉందంటూ సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు. వాదనలు విన్న న్యాయాధికారి నేడు, రేపు రెండు రోజుల పాటు నలుగురిని కస్టడీకి ఇస్తూ అనుమతి ఇచ్చారు. దీంతో ఈరోజు ఉదయం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నలుగురిని తీసుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం సిట్ కార్యాలయానికి తరలించి విచారణ మొదలుపెట్టారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో దాదాపు 5 గంటలకు ఈ నలుగురిని స్వయంగా సిట్ చీఫ్ విచారిస్తూ.. ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధిస్తున్నారు




# సంపాదకీయం

శనివారం 31-05-2025

## పాకిస్తాన్ నోట శాంతి మంత్రం

దెబ్బకు పాకిస్తాన్ దిగొస్తో?ంది. భారత్ చేస్తున్న ఒత్తిళ్లకు పాకిస్తాన్ తలలో జేజమ్మ దిగొచ్చింది. జమ్మూ కశ్మీర్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడితో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకలు మరణించారు. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 9 ఉగ్రస్థావరాలు ధ్వంసం చేసింది. తర్వాత పాకిస్తాన్ ప్రతిదాడులకు దిగడంతో భారత్ వాటిని తిప్పి కొట్టడంతోపాటు పాకిస్తాన్‌లోని 11 ఎయిర్ బేస్‌లను ధ్వంసం చేసింది. దీంతో ఆందోళనతో సీజ్‌ఫైర్‌కు వచ్చింది. తాజాగా శాంతి మంత్రి జపిస్తోంది. భారతదేశం దౌత్యపరంగా, సైనికపరంగా చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక చర్యల నేపథ్యంలో, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారు. ఇరాన్‌లో జరిగిన ఒక కీలక సమావేశంలో, కశ్మీర్‌తోసహా దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాస్పద అంశాలపై భారత్‌తో చర్చలకు సిద్ధమని ఆయన వెల్లడించారు. ఈ ప్రకటన పాకిస్తాన్ దౌత్య ఒత్తిడిని ఎదుర్కొంటున్న సమయంలో వెలువడటం గమనార్హం. భారత్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపై గట్టిగా పోరాడుతూ, పాకిస్తాన్‌పై ఒత్తిడి పెంచిన నేపథ్యంలో ఈ ప్రకటన ఒక కీలక మలుపుగా పరిగణించబడుతోంది. భారతదేశం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ సింధూర్' ద్వారా సైనిక చర్యలు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత సైన్యం, పాకిస్తాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని కూడా తీవ్రతరం చేసింది. పాకిస్తాన్ రాయబారులను వెనక్కి పంపడం, ఉగ్రవాదానికి పాక్ మద్దతును అంతర్జాతీయంగా బహిర్గతం చేయడం వంటి చర్యల ద్వారా భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. 33 దేశాలలో భారత ఎంపీల బృందాలు పర్యటిస్తూ, పాక్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టాయి. అగ్రరాజ్యాలతో సహా పలు దేశాలు భారత్ వైపు నిలిచాయి, ఇంకా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎంఎఫ్) పాకిస్తాన్‌కు నిధులు అందించవద్దని భారత్ విజ్ఞప్తి చేసింది. టెహ్రాన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీతో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ జరిపిన చర్చల సందర్భంగా ఈ శాంతి ప్రతిపాదన వెలువడింది. ఈ సమావేశంలో పాకిస్తాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ అసీమ్ మునీర్ కూడా పాల్గొన్నారు. భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతలు, గాజా సంక్షోభం వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు పాకిస్తాన్ పత్రిక 'ది డాన్' పేర్కొంది. షరీఫ్ తన ప్రకటనలో, కశ్మీర్, ఉగ్రవాదం, నీటి పంపకం, వాణిజ్యం వంటి అన్ని వివాదాస్పద అంశాలపై సామరస్యపూర్వక చర్చలకు సిద్ధమని, పాకిస్తాన్ శాంతి కోసం చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఇరాన్ ఈ ప్రతిపాదనను స్వాగతించి, భారత్?పాక్ మధ్య వివాదాలు త్వరలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ముఖ్యంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇక అప్పటి నుంచి పాకిస్థాన్‌కు నీళ్లు వెళ్లకుండా చేస్తోంది. అయితే ఈ ఒప్పందం రద్దు తర్వాత పాకిస్థాన్ మంత్రులంతా భారత్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్ నీళ్లను ఆపేస్తే తామేమీ ఊరుకోమని, యుద్ధం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈ నదిపై నిర్మాణాన్ని అయినా బాంబులు పెట్టి పేల్చేస్తామని అన్నారు. పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో ఏమన్నారంటే.. సింధు నదిలో పాకిస్థాన్ నీళ్లైనా పారాలి లేదా భారతీయుల రక్తమైనా పారాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా భారత్‌ను భయపెట్టే ప్రయత్నం చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ శాంతి చర్చల ప్రతిపాదనపై స్పందిస్తూ, చర్చలు జరిగినా అవి పరిమిత అంశాలకే పరిమితమవుతాయని స్పష్టం చేశారు. పాకిస్తాన్ ఆధీనంలోని కశ్మీర్ (పీవోకే), ఉగ్రవాదంపై దృష్టి సారించే అంశాలపై మాత్రమే చర్చలు సాధ్యమని ఆయన పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన నేపథ్యంలో, భారత్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టి వైఖరిని కొనసాగిస్తోంది. ఈ దాడి భారత్?పాక్ సంబంధాలలో మరో సంక్షోభాన్ని సష్టించింది, దీని ఫలితంగా భారత్ తన దౌత్య ఒత్తిడిని మరింత ఉధృతం చేసింది. ఉద్రికత్త పరిస్థితుల గురించి పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. తదుపరి స్థాయికి కూడా మేం సిద్ధంగా ఉన్నామని అన్నారు. "ప్రపంచం మధ్యవర్తిత్వం వహిస్తే, మేం దానికి కూడా సిద్ధంగా ఉన్నాం, కానీ మేం మా రక్షణను తగ్గించం అని అన్నారు. అయితే రెండు అణ్వాయుధ శక్తుల మధ్య యుద్ధం మొత్తం ప్రపంచానికి ఆందోళన కలిగించే విషయం. కాగా, భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇదే విషయమై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇప్పటికే పాకిస్తాన్ ఉప ప్రధాన మంత్రి, ఆర్మీ చీఫ్ తో మాట్లాడారు. మరి చూడాలి అమెరి కా విదేశాంగ మంత్రితో చర్చలు జరిపిన తర్వాత పాకిస్తాన్ ఉప ప్రధాని చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందిస్తుందో లేదో. భారత్?పాకిస్తాన్ మధ్య శాంతి చర్చలు చరిత్రలో అనేకసార్లు ప్రయత్నించబడ్డాయి, అయితే ఉగ్రవాదం, కశ్మీర్ వివాదం వంటి అంశాలు ఎల్లప్పుడూ అడ్డంకిగా నిలిచాయి. 1999లో లాహోర్ ఒప్పందం, 2001లో ఆగ్రా శిఖరాగ్రం వంటి ప్రయత్నాలు విఫలమైన నేపథ్యంలో, పాకిస్తాన్ తాజా శాంతి ప్రతిపాదనను భారత్ అనుమానంతోనే చూస్తోంది. అంతర్జాతీయ ఒత్తిడి, ఇరాన్ వంటి దేశాల మధ్యవర్తిత్వం ఈ చర్చలకు కొత్త ఊపును తెచ్చే అవకాశం ఉంది.

## యూపీలో దారికొస్తున్న నేరస్తుల ముఠాలు

లక్నో, మే 30, యూపీ పోలీసులు మరోసారి నేరస్థులపై తమ వైఖరిని కఠినతరం చేశారు. గత 24 గంటల్లోనే పోలీసులు 14 ఎన్‌కౌంటర్లు నిర్వహించారు. వీటిలో లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన ఒక పేరు మోసిన నేరస్థుడిని పోలీసులు హతమార్చగా, మిగిలిన 13 కేసుల్లో నేరస్థులను కాళ్లపై కాల్చి పట్టుకున్నారు. పోలీసుల ఈ చర్య కారణంగా నేరస్థులలో భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే, పదుల సంఖ్యలో నేరస్థులు చేతులు పైకెత్తి పోలీసుల ముందు లొంగిపోయారు. లారెన్స్ గ్యాంగ్ దుండగుడు నవీన్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసుల ఎస్‌టిఎఫ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. నవీన్ లారెన్స్ గ్యాంగ్‌లో షార్ప్ షూటర్. అతనిపై ఢిల్లీ, యుపిలో అర డజనుకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలోనే యుపి ఎస్టీఎఫ్ కు ఒక సమాచారం అందింది. ఆపై ఢిల్లీ పోలీసులతో కలిసి ఎస్టీఎఫ్ హాపూర్ లోని కొత్వాలి ప్రాంతంలో ఈ నేరస్థుడిని చుట్టుముట్టింది. ఈ సమయంలో, నవీన్ పోలీసు బృందంపై కాల్పులు జరిపాడు. కానీ అప్పటికే అప్రమత్తమైన పోలీసు బృందం ప్రతీకారం తీర్చుకుని అతన్ని చంపింది. యుపి పోలీసులు రాజధాని లక్నో నుండి ఎన్‌కౌంటర్ ప్రారంభించారు. ఇక్కడ పోలీసులకు ఒక రహస్య నేరస్థుడు కమల్ కిషోర్ గురించి ఒక సమాచారం అందింది. అతను 5 సంవత్సరాల అమాయక బాలికపై అత్యాచారం చేసి పరారీలో ఉన్నాడు. అందించిన సమాచారం ప్రకారం, మదేగంజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో పోలీసులు అతన్ని చుట్టుముట్టడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో, ఈ నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించాడు. ఈ పరిస్థితిలో, పోలీసులు కూడా ప్రతీకార కాల్పులు జరిపి అతన్ని పట్టుకున్నారు. సీతాపూర్ జిల్లాలోని కామియాపూర్ నివాసి అయిన ఈ నేరస్థుడు ఇక్కడి ఆనకట్ట సమీపంలోని మురికివాడల్లో నివసిస్తున్నాడు. మరోవైపు, ఘజియాబాద్ పోలీసులు ముఖాముఖి ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన దొంగను కూడా పట్టుకున్నారు. జలౌన్ నేరస్థులలో పోలీసుల భయం కనిపించింది. ఇక్కడ కొంచ్‌లోని నవీన్ జ్యువెలర్స్ దుకాణంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు నేరస్థులను పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు ఈ నేరస్థులను లొంగిపోవాలని కోరారు. కానీ రాజేంద్ర కుష్వాహా కుమారుడు గోలు అలియాస్ అజయ్ కుష్వాహా అనే నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరిపాడు. అటువంటి పరిస్థితిలో, పోలీసులు కూడా కాల్పులు జరిపారు. అయితే అజయ్ కాలిపై తూటా దిగింది. అతనిపై కాల్పులు జరపడం చూసి, అతని స్నేహితుడు రాము కుష్వాహా వణికిపోయాడు. అతనే చేతులు పైకెత్తి లొంగిపోయాడు. యుపి పోలీసుల అనేక ఇతర జిల్లాల్లో ఎన్‌కౌంటర్ కు పాల్పడ్డారు. ఉన్నావ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసులు ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు. అయితే మరో ఇద్దరు నేరస్థులు తప్పించుకోగలిగారు. అదేవిధంగా, బులంద్‌షహర్‌లో, 6 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని ఖుర్జా దేహత్ పోలీసులు ఎన్‌కౌంటర్ సమయంలో అరెస్టు చేశారు. బాగ్‌పత్ పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి, ఆగ్రా పోలీసులు ఒక నేరస్థుడిని కాలిపై కాల్చి పట్టుకున్నారు. మరోవైపు, ఝాన్సీలో, మాత్ కొత్వాలి పోలీసులు రూ. 25,000 బహుమతిని ప్రకటించిన నేరస్థుడిని ఎదుర్కొన్నారు. అదే సమయంలో, బల్లియా పోలీసులు ఒక గంట వ్యవధిలో రెండు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు నేరస్థులను అరెస్టు చేశారు. సహారన్‌పూర్ భట్టా మునిమ్‌ను దోచుకున్న దుండగులను ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి యూనిట్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో పట్టుకున్నారు. ఇదిలా ఉండగా, ఎన్‌కౌంటర్ సమయంలో హాపూర్ పోలీసులు నలుగురు దుండగులను అరెస్టు చేశారు. నేరస్థులలో ఒకరి కాలులో బుల్లెట్ దిగింది. కాగా, మరో నేరస్థుడు కాల్చి చంపారన్న భయంతో లొంగిపోయాడు. మరోవైపు, ముజఫర్ నగర్‌లో, పోలీసులు ముగ్గురు దుండగులను కాలిపై కాల్చి అరెస్టు చేశారు. అదే క్రమంలో, లక్నోలోని అలంబాగ్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు.

## గులాబీలో అంతర్గత సంక్షోభం



హైదరాబాద్, మే 30, ఃఖీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. పార్టీ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బహిర్గతం కావడం, ఆ తర్వాత కేటీఆర్, పార్టీ కార్యాలయంలో స్పందించడం, ఇద్దరు పార్టీ సీనియర్ నేతలను కేసీఆర్, కవిత వద్దకు రాయబారం పంపడం, కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కవిత రాయబారం నడిపారని పత్రికల్లో వార్తలు రావడం, ఆ తర్వాత కవిత మీడియాతో చిట్ చాట్ చేయడం ఈ పరిణామాలన్నీ పార్టీలో నెలకొన్న అంతర్గత సంక్షోభ పరిస్థితులను తెలియజేస్తున్నాయి. అయితే వీటన్నింటికి కవిత అసంతృప్తే కారణం. పార్టీ అధినాయకత్వం నుంచి అసలు ఆమె ఏం కోరుకుంటున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ఉద్యమ సమయంలోను, పార్టీ కార్యక్రమాల్లో కేటీఆర్, హరీశ్ రావుతో సమానంగా తాను పాల్గొన్నప్పటికీ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న ఆక్రోశం తన లేఖ ద్వారా కవిత బయటపెట్టారు. తాను జైలుకు వెళ్లివచ్చినప్పటి నుంచి పార్టీకి దూరం పెడుతున్నారన్నది ఆమె వాదన. పార్టీ కీలకమైన నిర్ణయాల్లో తనను భాగస్వామిని చేయకుండా ఎందుకు దూరం పెడుతున్నారన్నది కవిత ఆవేదన. పార్టీలో తాను కోల్పోయిన వైభవాన్ని, ప్రతిష్టను తిరిగి పునరుద్ధరించాలన్నది కవిత ప్రధాన డిమాండ్ పార్టీలో కొందరు తామే కేసీఆర్‌ను నడిపిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారని కవిత మీడియా చిట్ చాట్ లో ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వం తప్ప మరేవరి నాయకత్వాన్ని ఒప్పుకునేది లేదని, ఈ విషయంలో పార్టీకి స్పష్టమైన సంకేతాలు పంపాలని పార్టీ అధినేత కేసీఆర్‌ను కవిత కోరుతున్నట్లు తెలుస్తోంది. పార్టీలో నిన్నటి మొన్నటి వరకు అగ్రనేతగా వెలుగొందిన తనపై ఆరోపణలు వస్తే కనీస మాత్రంగానయినా పార్టీ ఎందుకు స్పందించలేదన్నది ఆమె ప్రశ్న. పార్టీ అంతా కేసీఆర్ కనుసన్నల్లోనే నడవాలని, నిర్ణయాధికారం కేసీఆరే చేపట్టాలని కవిత తన లేఖ ద్వారా, మీడియాతో వ్యక్తీకరించిన అభిప్రాయాల ద్వారా డిమాండ్ చేస్తున్నారు. మైడియర్ డాడీ అని, కేసీఆరే తన దేవుడని లేఖలో కవిత సంభోధించడం ద్వారా ఆయనతో తనకు ఉన్న అనుబంధాన్ని కవిత చెప్పకనే చెప్పారు. ఆయన పట్ల తనకున్న స్పష్టమైన విధేయతను లేఖ ద్వారా బహిర్గతం చేశారు. తన తండ్రి పంపిన రాయబారులతో కూడా, నేరుగా కేసీఆర్ తో మీటింగ్ ఏర్పాటు చేయాలని వారిని కవిత కోరడం జరిగింది. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లిన తర్వాతి నుంచి తన తండ్రి ద్వారా తనకు ఎలాంటి దిశానిర్దేశం లేనట్లు స్పష్టం అవుతుంది. తన రాజకీయ భవిష్యత్తుకు కేసీఆరే మార్గనిర్దేశనం చేయాలన్నది కవిత డిమాండ్. ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్ మద్దతును ఆమె కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసే అంశంపై పార్టీకి స్పష్టత ఇవ్వాలన్నది కవిత మరో డిమాండ్. తాను జైలుకు వెళ్లేటప్పుడే ఈ కుట్రలకు తెరలేపారని ఆమె మీడియాతో చెప్పారు. బీజేపీతో కలవడం సరికాదన్న అభిప్రాయాన్ని లేఖ ద్వారా ఇప్పటికే కవిత చెప్పారు. పార్టీ స్వతంత్రంగా పని చేయాలని, విలీనం అనే అంశం ఏకపక్ష నిర్ణయం కాకూడదన్నది కవిత డిమాండ్. ఓ రకంగా చెప్పాలంటే పార్టీ నిర్ణయాలన్నీ పారదర్శకంగా ఉండాలని, అందులో తన భాగస్వామ్యం ఉండాలని కవిత డిమాండ్ చేస్తున్నట్లు అర్థమవుతోంది కొద్ది రోజులుగా బీఆర్ఎస్‌లో జరుగుతున్న పరిణామాలన్నీ చూస్తుంటే కవిత రాసి లేఖ, మీడియాతో ఆమె అభిప్రాయలను వ్యక్తం చేయడం, పార్టీలో నలుగుతున్న సమస్యను సూచిస్తోంది. తాను కోల్పోయన ప్రాధానత్యను తిరిగి పొందడం, కేసీఆరే పార్టీ రథసారథిగా వ్యవహరించాలని సూచించడం, తన రాజకీయ భవిష్యత్తుకు కేసీఆర్ నుంచి హామీ కోరడం, పార్టీ విలీనంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఇవన్నీ పార్టీలో రగులుతున్న సంక్షోభానికి నిదర్శనాలు. అయితే పార్టీ అధినేత కవిత ఆకాంక్షలకు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. ఆయన స్పందనను బట్టే కవిత రాజకీయ లక్ష్యాలు ఉంటాయనడంలో సందేహం లేదు.

## సిటీలో మరో రెండు ఫ్లై ఓవర్లు

హైదరాబాద్, మే 30, తెలంగాణలోని రేవంత్ సర్కార్ హైదరాబాద్ నగరం అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటుంది. భాగ్యనగరంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని భావించిన రేవంత్ సర్కార్.. సుమారు 7 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో.. హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో భాగంగా దాదాపు రూ.1740 కోట్ల ఖర్చుతో.. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్డు డెవలప్‌మెంట్ పనుల కోసం జీహెచ్ఎంసీ.. ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఇక ఇప్పటికే నగరంలో పలు ఫ్లైఓవర్లు ప్రారంభం కాగా.. మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ఇదిలా ఉండగా తాజాగా జీహెచ్ఎంసీ హైదరాబాదీలకు మరో శుభవార్త చెప్పింది. నగరంలో బాగా రద్దీ ఉండే రెండు ప్రాంతాల్లో.. మరో రెండు ఫ్లై ఓవర్లు, ఒక అండర్‌పాస్ నిర్మాణ పనుల కోసం తాజాగా టెండర్లను ఆహ్వానించింది. ఈ మూడింటి నిర్మాణ పనులకు.. ఒకే ప్యాకేజీ కింద టెండర్లు ఆహ్వానించింది. వీటి నిర్మాణానికి సుమారు రూ.368 కోట్లుగా జీహెచ్ఎంసీ అంచనా వేసింది. వీటికి జూన్ 18న టెండర్లు సమర్పించడానికి చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. ఈ మూడింటి నిర్మాణంతో.. హైసిటీ పనుల్లో మరో అడుగు ముందుకు పడినట్లయింది. జీహెచ్ఎంసీ తాజాగా నిర్మించదలిచిన రెండు ఫ్లైఓవర్ల విషయానికి వస్తే.. ఒకటి బంజారాహిల్స్ ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జీవీకే మాల్ రోడ్డు వైపు రెండు లేన్లతో కాగా.. మరోకటి జంక్షన్ వద్ద 2 లేన్ల అండర్‌పాస్, 3 లేన్లతో ఫ్లై ఓవర్ నిర్మించనుంది. ఇప్పుడు ఈ పనులకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 3 మీదుగా అటు నుంచి జీవీకే మాల్‌వైపు కొనసాగుతంది. రెండు లేన్లతో ఒక అండర్‌పాస్ నిర్మించేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళిలకు రచిస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే.. ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి శ్రీనగర్ కాలనీ రూట్‌లో వెళ్లే వారికి చాలా ఉపయోగకరంగా ఉండనుంది. పది మీటర్ల వెడల్పుతో ఈ అండర్‌పాస్ నిర్మించనున్నారు. అంతేకాక ఇక్కడ ఫుట్‌పాత్‌లతోపాటు రెండు లక్షల నీటి సామర్థ్యంతో భూగర్భ సంప్ నిర్మాణం కూడా చేపట్టనున్నారు. బంజారాహిల్స్ ముగ్ధ జంక్షన్ నుంచి మీదుగా ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వైపు 3 లేన్లతో దీన్ని నిర్మించనున్నారు. ఈ ఫ్లైఓవర్ వెడల్పు 12 మీటర్లుగా ఉండనుంది. ఈ ప్యాకేజీలో నిర్మాణం చేపట్టబోయే ఈ ఫ్లైఓవర్లు ప్రయాణ మార్గం ఒకే దిశగా సాగనుంది. ఇవి అందుబాటులోకి వస్తే.. ఈ రద్దీ ఏరియాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరతాయంటున్నారు. ఈ పనుల ప్రారంభం కోసం జీహెచ్ఎంసీ టెండర్లను ఆహ్వానించింది. దీనిలో ఎంపికయ్యే ఏజెన్సీయే.. ఈ ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంబంధించిన సర్వే, డిజైన్‌తో సహ మొత్తం పనులు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు ఏవైనా మరమ్మతులు అవసరమైతే చేయాల్సి ఉంటుంది.

## సర్దార్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, బోరబొండలో కాంగ్రెస్ నాయకుల వేధింపులకు బిఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సర్దార్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బిఆర్ఎస్ పార్టీలో పది సంవత్సరాలు అనుభవించి కాంగ్రెస్ వెళ్ళిన కార్పొరేటర్ అరాచకాలు పిసిసి అధ్యక్షుడు గమనించాలి. కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకుంటే స్వాగతించాం. సోమవారం ప్రజావాణిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిల్డింగ్ లపై పిర్యాదులు చేయడం. నిర్మాణదారుల వద్ద డబ్బులు దండుకోవడం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి అని అన్నారు. శేరిలింగంపల్లిలోని అయ్యప్ప సొసైటీలో ఎలాంటి పర్మిషన్లు లేకుండా బిల్డింగ్ నిర్మిస్తుంటే ఎందుకు కూల్చివేతలు చేపట్టలేదు. బిఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సర్దార్ మృతి కాంగ్రెస్ పార్టీనే బాధ్యత వహించాలి. ఫతే నగర్ బ్రిడ్జి కోసం నాటి మంత్రి కేటీఆర్ నిధులు కేటాయించి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం వల్లే మొన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వం స్పందించక పోతే ఫతే నగర్ బ్రిడ్జి పైన ధర్నా చేపడతామని అన్నారు.

## స్లీపర్ సెల్ లో యూ ట్యూబర్ బయ్యా యాదవ్

హైదరాబాద్, మే 30, యూట్యూబ్ సెలబ్రిటీ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న వారిలో ఒకరు బయ్యా సన్నీ యాదవ్. ప్రపంచం మొత్తం బైక్ మీద తిరుగుతూ, అందుకు సంబంధించిన వీడియోస్ ని యూట్యూబ్ లో అప్లోడ్ చేయడం, అవి బాగా వైరల్ అవ్వడం వంటివి జరుగుతూ ఉండేవి. అయితే బెట్టింగ్ యాప్స్ ని ఒక రేంజ్ లో ప్రమోట్ చేయడం వల్ల ఇతనిపై కేసులు నమోదు చేసి గత కొంతకాలంగా పోలీసులు ఇతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఎట్టకేలకు రీసెంట్ గా అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకొని ఇతన్ని విచారించగా కొన్ని సంచలన విషయాలు బయటపడ్డాయి. 'ఆపరేషన్ సింధూర్' సమయంలో ఇతను పాకిస్తాన్ లో ఉండేవాడట. దుబాయ్ లో ఉన్నప్పుడు ఈయనకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన దుబాయి నుండి నేరుగా పాకిస్తాన్ కి వచ్చాడు. ఇప్పటి వరకు ఈయన 5 సార్లు పాకిస్తాన్ కి వెళ్లినట్టు సమాచారం. అసలు ఇరు దేశాల మధ్య రాకపోకలు ఆగిపోయిన సమయంలో ఇతను పాకిస్తాన్ కి ఎలా చేరాడు?, దేశం కష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇతను శత్రు దేశం లో ఎందుకు తలదాచుకున్నాడు? అనే అంశాలపై ప్రస్తుతం పోలీసులు ఆరా తీస్తున్నారు. రీసెంట్ గానే పాకిస్తాన్ గూఢచారి జ్యోతి మల్హోత్రా ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె తో సన్నీ కి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోసం లో కూడా విచారిస్తున్నారు పోలీసులు. ఇతని గురించి తెలిసిన ఈ కొత్త నిజాలను చూసి నెటిజెన్స్ నోరెళ్లబెడుతున్నారు. ఏదో బెట్టింగ్ స్కాం లో ఒక్కటే ఇరుకున్నాడని అనుకుంటే, ఇరు దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న సమయం లో శత్రు దేశం లో తలదాచుకోవడం లో ఆంతర్యం ఏమిటి?, ఇతనికి కూడా పాకిస్తాన్ టెర్రరిస్ట్ తో సంబంధాలు ఉన్నాయా?, మన దేశం లో పాకిస్తాన్ స్లీపర్ సెల్స్ చాలా మంది ఉన్నారు. రీసెంట్ గానే వైజాగ్ లో కూడా ఒక స్లీపర్ సెల్ ని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసిన సంగతి మన అందరికీ తెలిసిందే. బన్నీ సన్నీ యాదవ్ కూడా ఆ కోవకు చెందిన వ్యక్తియేనా? అని అతన్ని అనుసరించే వాళ్ళు కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు పోలీసులే తెలియచేయాల్సి ఉంటుంది. సన్నీ యాదవ్ ఒక విధంగా అరెస్ట్ అవ్వడానికి కారణం అన్వేష్ అనొచ్చు (నా అన్వేషణ, ప్రపంచ యాత్రికుడు). బెట్టింగ్ యాప్స్ పై ఆయన పెద్ద యుద్ధమే చేస్తున్నాడు. గతంలో ఈ అంశంపై వీళ్లిద్దరి మధ్య గొడవలు వేరే లెవెల్ లో జరిగాయి. అసభ్యకరమైన పాదయాజాలంతో దూషించుకున్నారు. అన్వేష్ వల్ల సన్నీ యాదవ్ బెట్టింగ్ యాప్స్ ని ప్రమోట్ చేయడం లో కింగ్ అని తెలిసి అతని పై కేసు ని నమోదు చేసాడు, ఎట్టకేలకు ఇప్పుడు అదుపులోకి తీసుకున్నారు.

## ఆయుష్మాన్ స్కీంలో ఇంపార్టెంట్ అప్ డేట్

హైదరాబాద్, మే 30, (న్యూస్ పల్స్) ఆదాయంతో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో సీనియర్ సిటిజన్స్ చికిత్స పొందవచ్చు. అయితే 70 ఏళ్ళు పైబడిన ఈ కార్డు కోసం ఆయుష్మాన్ భారత్ యాప్ ద్వారా 10 సులభమైన దశలలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో అలాగే ఈ కేవైసీ ప్రక్రియ ఎలా పూర్తి చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. 70 ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్స్ కి కేంద్ర ప్రభుత్వం ఒక శుభవార్త తెలిపింది. పై వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా కూడా ఆసుపత్రి ఖర్చుల గురించి భయపడాల్సిన అవసరం ఉండదు. సీనియర్ సిటిజన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ వయా వందన యోజన పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్ ఉచితంగా ఐదు లక్షల వరకు బీమా పొందవచ్చు. మీరు సంపాదించిన దానితో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ కార్డుతో సీనియర్ సిటిజన్స్ ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అక్టోబర్ 2024లో ప్రారంభించిన ఈ పథకం ఆయుష్మాన్ భారత్ లో ఒక భాగం అని చెప్పొచ్చు. ఈ పథకం కింద 70 ఏళ్ళు భయపడిన ప్రతి ఒక్కరు కూడా ఐదు లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆరోగ్య భీమా కవరేజ్ పొందవచ్చు. సీనియర్ సిటిజన్స్ కి ఈ కార్డు ఉంటే చాలు వాళ్ళు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో కూడా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. వీరికి ఇంతకుముందు ఉన్న వ్యాధులు అన్నిటికీ కూడా కార్డు తీసుకున్న తొలి రోజు నుంచి ఆసుపత్రిలో చికిత్స అందుతుంది. వెయిట్ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. ఈ కార్డు కోసం మీ ఫోన్లోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా మీరు ఆయుష్మాన్ భారత్ యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలి. ఇందులో బెనిఫిషియరీగా లాగిన్ అవ్వాలి. మొబైల్ నెంబర్ ఇచ్చి ఓటిపి ద్వారా లాగిన్ అవ్వండి. ఆ తర్వాత మీ రాష్ట్రం పేరుతో పాటు ఆధార్ నెంబర్ కూడా ఎంటర్ చేయండి. ఒకవేళ ఈ జాబితాలో మీ పేరు కనిపించకపోతే వెంటనే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయండి. ఓటిపి పొందిన తర్వాత అనుమతి ఇవ్వండి.

# పార్టీలో మూడు కుంపట్లు..



హైదరాబాద్, మే 30, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మౌనం ఇప్పుడు అనేక ప్రశ్నలకు దారి తీస్తోంది. ఆయన నిర్ణయాల్లోని ఊగిసలాట, స్పష్టత లేకపోవడం వల్ల పార్టీ శ్రేణులు మూడు గ్రూపులుగా విడిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు, కూతురు కవిత – ఈ ముగ్గురికీ పార్టీలో సొంత బలగాలున్నాయి. నిజానికి, ఈ మూడు శక్తులు కలిసికట్టుగా ఉంటేనే బీఆర్ఎస్ బలంగా ఉంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కొని పార్టీని పటిష్టపరచాల్సిన సమయంలో, అంతర్గత గ్రూపు రాజకీయాలతో బీఆర్ఎస్ బలహీనపడుతోందిఇటీవలే కవిత రాసిన ఒక లేఖ బహిర్గతం కావడంతో పార్టీలోని విభేదాలు రచ్చకెక్కాయి. బీఆర్ఎస్ లో ఏదో జరుగుతోందనే వార్తలు, కథనాలు మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీలో ఈ విభేదాలను నిలువరించడం పార్టీ పెద్దగా కేసీఆర్ కే సాధ్యం. ఆయన చొరవ తీసుకుంటేనే ఈ పరిస్థితికి ముగింపు పడుతుంది. లేదంటే, ఈ అంతర్గత కలహాలు పార్టీని పూర్తిగా ముంచే ప్రమాదం ఉంది.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం తర్వాత పార్టీ గాడి తప్పినట్లు, అంతర్గత లుకలుకలు బయటపడినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్యనే ఆధిపత్య పోరు నడుస్తుండడంతో పార్టీలోని కీలక నేతలతో సహా కార్యకర్తలు అయోమయంలో పడిపోయారు. కవిత రాసిన లేఖ ఈ గ్రూపు తగాదాలకు కొత్త మలుపునిచ్చింది. కవిత అమెరికా పర్యటనకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో నాటకీయంగా ఈ లేఖ లీక్ కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ లీకు వెనుక ఎవరున్నారనేది పక్కన పెడితే, అసలు కవిత పార్టీకి సంబంధించిన అంశాలపై లేఖ రాయాల్సినంత తీవ్రమైన పరిస్థితులు బీఆర్ఎస్ లో ఏర్పడ్డాయనేదే ఇక్కడ కీలకం. ఈ లేఖ తానే రాశానని కవిత స్వయంగా అంగీకరించడం పార్టీలో విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలియజేస్తోంది.పార్టీ బలోపేతం కోసమే తాను ఈ లేఖ రాశానని కవిత చెప్పినప్పటికీ, దీనికి మీడియాలో, సోషల్ మీడియాలో లభించినంత విస్తృతమైన చర్చ క్షేత్రస్థాయిలో జరగలేదు. ప్రజలు కూడా ఇదంతా ఒక కుటుంబ డ్రామాగానే ఉందని, కేసీఆర్ జోక్యం చేసుకుంటే అంతా సమిసిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో కూడా కవితకు ఆశించిన మద్దతు లభించలేదు. ఈ లేఖ వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయనే అభిప్రాయం బీఆర్ఎస్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.ఎయిర్‌పోర్ట్‌లో కవిత విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని చెప్పడంపై పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో 'కవిత సీఎం సీఎం' అంటూ ఆమె అనుచరులు చేసిన నినాదాలను కవిత వారించి ఉంటే, ఆమె కేసీఆర్‌ను ధిక్కరించలేదనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో కలిగి, ఆమెకు కొంత మద్దతు లభించేది.బీఆర్ఎస్ లో కేటీఆర్, కవిత, హరీశ్ మధ్య ఆధిపత్య పోరుపై భిన్నమైన అభిప్రాయాలున్నాయి. కేటీఆర్ ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండడంతో పార్టీలో ఆయనది ప్రత్యేక స్థానం. ఇదే సమయంలో పార్టీలో హరీశ్ రావుకు కూడా కీలక ప్రాధాన్యతే ఉంది. ఉద్యమ సమయం నుంచి పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న హరీశ్ రావుపై ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉంది. పార్టీలో కుటుంబ సభ్యుల మధ్యే పోరు నడుస్తుండడంతో కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.హరీశ్ బలమేంటో, తనయుడి బలహీనత ఏంటో బాగా తెలిసిన కేసీఆర్ కొడుకు కేటీఆర్ ను ఒక మెట్టు ఎక్కించడానికి, మేనల్లుడు హరీశ్ ను ఒక మెట్టు దించే ప్రయత్నాలు గతంలో అనేకసార్లు చేశారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధించిన తర్వాత హరీశ్ కి మంత్రి పదవి ఇవ్వకుండా దూరం పెట్టారు. దీంతో ఆయన సిద్దిపేటకే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఏకపక్షంగా కేటీఆర్ కి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టారు.అప్పుడు కూడా కేటీఆర్ నాయకత్వంలో పని చేయడానికి తాను సిద్ధమని హరీశ్ తన విధేయతను ప్రకటించారు. అనంతరం ఇంటా బయట తీవ్ర ఒత్తిడి రావడంతో హరీశ్ కి మంత్రి పదవి ఇచ్చినా... అంతకు ముందు నీటిపారుదల మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్న హరీశ్ కు ఆ శాఖ కాకుండా ఆరోగ్య శాఖ బాధ్యతలు ఇచ్చారు. పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీశ్ కు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఇతర ఉప ఎన్నికల్లో ప్రాధాన్యత తగ్గించడంతో అప్పుడు బీఆర్ఎస్ బలహీనపడగా, బీజేపీ బలపడింది. కవిత ఎదురు తిరగడానికి అనేక కారణాలున్నాయి. తనను లిక్కర్ కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరెస్టు చేస్తే కేసీఆర్ ఆ పార్టీపై వెనకడుగు వేస్తున్నారనే అభిప్రాయం కవితలో ఏర్పడింది. రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీపై తేలికపాటి విమర్శలు చేయడం వల్ల పార్టీపై ప్రజల్లో అనుమానాలు పెరిగాయని ఆమె తండ్రికి రాసిన లేఖలో చెప్పడానికి ఇదే ప్రధాన కారణం. రాజకీయంగా బీజేపీ కోసం తనను బలిపశువు చేశారనే ఆగ్రహం ఆమెలో ఉంది.

# తెలంగాణ కాంగ్రెస్‌ను లైట్ తీసుకుంటున్న అధిష్ఠానం

హైదరాబాద్, మే 30, దేశంలో బిజెపి జోరును తట్టుకుని మూడే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అందులోనూ తెలంగాణలో మరే ఇతర పార్టీలతో పొత్తు లేకుండా రేవంత్ ప్రభుత్వం ఏర్పడింది. కూటమి కుంపట్లకు దూరంగా తెలంగాణలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ పరిస్దితి ఇప్పుడు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేవంత్ పగ్గాలు చేపట్టిన తరువాత ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు,గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కానీ ఆ పథకాల నుంటి ఆశించిన స్దాయిలో అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికిక మైలేజ్ పొందలేక పోయారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం క్షేత్రస్థాయిలో పార్టీకి బ్రాండ్ అంబాసిడర్లుగా చెప్పుకునే పిసిసి కార్యవర్గమే ఇంకా ఏర్పాటు కాలేదు. పిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకుని తొమ్మిది నెలలు దాటినా, నేటికీ క్షేత్రస్థాయిలో కమిటీల నియామకం జరగలేదు. అలా అని తప్పు రాష్ట్ర పార్టీదా అంటే కాదు, ఇక్కడ లైట్లు వెలగాలంటే అక్కడ స్విచ్ నొక్కాలి. అలా ఢిల్లీలో స్విచ్ ఆన్ చేయించేందుకు హైదరాబాద్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి ఛీఫ్ అనేక సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోవాల్సిన పరిస్థితులొచ్చాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారనే స్థాయిలో పరిస్థితులు చేరాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పిసిసి కార్యవర్గంలో తమకూ చోటు దక్కుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నవారి లిస్ట్ చాంతాడంత ఉంది. అయితే అందులో ఇప్పటికే వడపోతల తరువాత ఒక్కో పదవికి మూడు పేర్లు చప్పున లిస్ట్ సిద్దం చేసింది పిసిసి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రేపో మాపో పదవులు ప్రకటన రాబోతుందని కోటి ఆశలు పెట్టుకున్నవారు ఇప్పుడు నీరసించి విసిగిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నా కనీసం ప్రచార కమిటీ నియామకం కూడా జరగలేదు. ఆర్టీసీ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్లు వంటి రాష్ట్ర స్దాయి పదవుల నుంచి మార్కెటింగ్ కమిటీ చైర్మెన్లు, లైబ్రరీ చైర్మన్లు ఇలా నామిటేడెట్ పోస్టుల ఊసేలేదు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచి టూ జెడ్ పీ చైర్మన్ వరకూ ఏ ఒక్కరి పేర్లు ఖరారు చేయలేదు. సిఎం రేవంత్ రెడ్డితోపాటు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సైతం అనేకసార్లు ఢిల్లీ పెద్దలను కలిసేందుకు వెళ్లారు. పిసిసి కార్యవర్గం లిస్ట్‌కు ఆమోదం కోసం అందుబాటులో ఉన్న పెద్దలను కలిసినా ఫలితం లేదు. ఇంకా స్విచ్ నొక్కాలంటే సమయం పడుతుందని ఢిల్లీ నుంచి వెనక్కి పంపేశారు. రేవంత్ రెడ్డి సిఎం పదవి చేపట్టి ఏడాదిన్నర దాటినా, మంత్రివర్గ విస్తరణ మాత్రం అతి పెద్ద టాస్క్‌గా మారింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినప్పుడు పడ్డ కష్టాలకంటే మంత్రివర్గ విస్తరణ కోసం పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న అవమానాలే ఎక్కువైయ్యాయనే టాక్ నడుస్తోంది. తెలంగాణ క్యాబినెట్‌లో మొత్తం 18 మంత్రి పదవులకుగానీ సిఎంతో కలపి మొత్తం 12 మంత్రి పదవులు భర్తీ అయ్యాయి. మరో ఆరు శాఖలు ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహుల లిస్ట్ తో ఢిల్లీ చుట్టూ సిఎం రేవంత్ రెడ్డి ఎక్కే ఫ్లైట్, దిగే ఫ్లైట్ అంటూ ఎంత తిరిగినా అధిష్ఠానం పెద్దల నుంచి రేవంత్ లిస్ట్‌కు ఆమోదం దొరకలేదు. తాజాగా ఖర్గే అందుబాటులో లేరని వెనక్కు పంపించేశారు. గతంలో వెళ్లినా రాహుల్ ఉంటే కేసీ వేణుగోపాల్ ఉండరు, వాళ్లిద్దరూ ఉంటే మరొకరు ఉండరు. ఇప్పటికే ప్రతిపక్షాలు రేవంత్ ఢిల్లీ పర్యటనపై సెటైర్లు వేస్తూ ఓ రేంజ్ లో మాటల తూటాలు పేలుస్తు?న్నారు. వారి మాటలకు మరింత బలం చేకూరేలా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలూ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విపిస్తున్నాయి. ఈ పరిణామాలు చూస్తుంటే, తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే పదేళ్ల పాటు పార్టీ కోసం శ్రమించి, తీరా అధికారంలోకి వచ్చినా ఆశించిన పదవులు అందకపోవడంతో కింది స్థాయి క్యాడర్ లో నిస్తేజం నెలకొటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. ప్రతీ సినిమా మొదలయ్యే ముందు వచ్చే ఈ మాటలు విని ఎంత మంది పొగ మానేస్తారో అర్థం కాదు. పొగ తాగడం వల్ల హానికరం అని తెలిసి కూడా మానలేకపోతున్నవారు చాలామందే ఉన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది.1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది.




# వివాదంలో సినిమా అవార్డులు

హైదరాబాద్, మే 30, తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంది. గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటిస్తూ.. 'పుష్ప 2' హీరో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా పురస్కారం ఇవ్వడంపై బీజేపీ కాంగ్రెస్‌ను ఎండగడుతోంది. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ఉన్న సినిమాను విమర్శిస్తూనే.. మరోవైపు అదే వ్యక్తికి అవార్డు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తోంది. ఇది కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణలో రాజకీయ విమర్శలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా.. తెలంగాణ బీజేపీ తన సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో అవార్డులను ప్రకటించింది. ఈ పురస్కారాల్లో భాగంగా, 'పుష్ప 2' సినిమా హీరోగా చేసిన అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు వరించింది. అయితే.. ఈ నిర్ణయంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా బీజేపీ నుండి పరోక్ష విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నిజానికి, 'పుష్ప' సినిమాలో పోలీసులు, ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా హీరో వ్యవహరించడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గతంలో తీవ్ర విమర్శలు చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పాత్రలను ప్రోత్సహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన సంధ్యా థియేటర్ ఘటనలో కూడా అల్లు అర్జున్ తీరుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు గుప్పించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా సాహసం చేసిన పాత్రకు అవార్డు ఇవ్వడం, అంతేకాకుండా పోలీసుల ఊచకోతకు కారణమైన నక్సల్ నేపథ్యం ఉన్న గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటించడంపై బీజేపీ పరోక్షంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.బీజేపీ తెలంగాణ తన సోషల్ మీడియా ఖాతాలో "రంగు రంగుల జండాలు మార్చిన రంగోలి రేవంత్ నాయకత్వంలో... అసలు రంగు కాంగ్రెస్ నాయకులు మర్చిపోయినట్టున్నారు" అంటూ వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. దీని ద్వారా.. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ప్రచారం చేసే సినిమాలను, వ్యక్తులను విమర్శిస్తూనే, మరోవైపు అటువంటి వారికి అవార్డులు ఇవ్వడం, గతంలో నక్సల్ ఉద్యమ నేపథ్యం ఉన్న వారికి పురస్కారాలు ప్రకటించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తుందని బీజేపీ పరోక్షంగా ఆరోపిస్తోంది. ఇది తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఈ విమర్శలకు మరింత పదును పెడుతూ.. 'పోలీసులపై ఇంత ప్రేమ ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు... అదే పోలీసుల ఊచకోతకు కారణమైన గద్దర్ పేరును ఉత్తమ అవార్డులకు పెడతారు' అని బీజేపీ ఆరోపించింది. అమాయక ప్రజల, పోలీసుల ప్రాణాలను కబలించే నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులే అడ్డుపడతారని బీజేపీ మండిపడింది.అంతా మీ ఇష్టమేనా.. మీరే విమర్శించి.. మీరే అవార్డులు ఇస్తారా'.. సంచలన పోస్ట్ వైరల్..కల్పిత పాత్ర అయిన పోలీసును సినిమాలో అవమానిస్తే బాధపడుతున్న మంత్రి అనసూయ (సీతక్క), నిజ జీవితంలో పోలీసులను ఊచకోత కోసిన నక్సలైట్లకు శ్రద్ధాంజలి ఘటిస్తారని, వారి ఆశయ సాధనకు పాటు పడతామని అనడం విడ్డూరమన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కపట బుద్ధిని చూపుతుందని.. 'ఊసరవెల్లి కూడా ఉరేసుకుంటుంది' అని బీజేపీ ఎద్దేవా చేసింది. నక్సలిజంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న వైరుధ్యపూరిత వైఖరిని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం..



వరంగల్ , మే 30, తెలంగాణలో వానల తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. మున్ముందు భారీ వానలు కురుస్తాయనే నివేదికల దృష్ట్యా.. వ్యాధుల విస్తరణ నిరోధానికి పలు నిర్దేశాలు చేశారు. దోమ తెరల వాడకం, నీటి నిలువ తొలగించడం, శుద్ధి చేసిన నీటిని తాగడం, బహిరంగ ఆహారాలు నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటివి ముఖ్యమని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు వంటి అనారోగ్య లక్షణాలున్న వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని.. అత్యవసరాలలో 108కి డయల్ చేయాలని సూచించారుతెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలంగాణ ప్రజా వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది.వర్షాకాలంలో సాధారణంగా పెరిగే దోమల బెడదను నివారించడం అత్యంత ముఖ్యం. దీని కోసం, ఇళ్లలోని తలుపులు, కిటికీలకు మస్కిటో నెట్‌లను అమర్చుకోవడం ద్వారా దోమల ప్రవేశాన్ని అరికట్టవచ్చని వైద్య శాఖ సూచించింది. అంతేకాకుండా, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చు. ఈ చర్యలు డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తాయి.ఇక.. తాగునీటి విషయంలో కూడా అప్రమత్తత అవసరం. ఫిల్టర్ చేసిన లేదా కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని ఆరోగ్య శాఖ నొక్కి చెప్పింది. బయటి ఆహార పదార్థాలను తినడం మానుకోవాలని, వాటి వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలుప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరచుగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గాలి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల నివారణకు, జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న వారికి దూరంగా ఉండాలి. ఒకరినొకరు కలుసుకునేటప్పుడు చేతులు కలపడం వంటివి తగ్గించుకోవాలి. ఒకవేళ అలా చేస్తే, తప్పనిసరిగా శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.ఎవరికైనా దగ్గు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని వైద్య శాఖ విజ్ఞప్తి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 108కి కాల్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు అన్ని రకాల వైద్య సదుపాయాలతో, సిబ్బందితో సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరింది. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే, ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## వేములవాడలో రాజన్న కోడెల మృతి కలకలం

రాజన్న సిరిసిల్ల మే 30, వేములవాడలో రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందడం కలకలం రేపుతున్నాయి. తిప్పాపురం గోశాలలో 8 కోడెలు మృతి చెందాయి. రాజన్న కోడెల మృతితో సర్వత్రా ఆందోళన నెలకొంది. గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉండడంతో మృత్యువాత పడుతున్నాయి. 400 ఉండాల్సిన గోశాలలో ఉన్న 1200 కోడెలు వున్నాయని సమాచారం. పరిమితికి మించి ఉన్న కోడెలు ఊపిరాడక, పోట్లాటతో అనారోగ్యంపాలై మృత్యువాత పడుతున్నాయి. రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా ఇవ్వాలనే అధికారుల నిర్ణయం పక్కదారి పట్టడంతో కోడెలు పంపిణీకి బ్రేక్ పడింది. కోడెల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దైవభక్తితో భక్తులు సమర్పించే రాజన్న కోడెలు మృత్యువాత పడడం ఆందోళనకరం.

## రియల్ ఎస్టేట్ పేరుతో విదేశీయులకే కుచ్చు టోపి

శ్రీ సత్య సాయి,మే 30, పుట్టపర్తిలో సత్యనారాయణ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ పేరుతో విదేశీయులు నమ్మించి మోసం చేసాడు. సత్య సాయిబాబా భక్తులైన విదేశీయులే టార్గెట్ గా పావులు కదిపాడు. వివిధ దేశాలకు చెందిన పలువురు భక్తులతో దాదాపు 70 కోట్లకు చెందిన ఆస్తులను కొల్లగొట్టాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ కి చెందినఅర్విన్ ఫ్రాన్సిస్ ఈనెల 22వ తేదీన సత్యనారాయణకు భూములు కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఎనిమిది కోట్ల రూపాయలు తన అకౌంట్ ద్వారా ట్రాన్స్ఫర్ చేశానని.... కొన్ని భూములు కొనుగోలు చేయకుండా తనను మోసం చేసినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసాడు. మరో ఇద్దరు యు ఎస్ కి చెందిన బాధితుల సైతం సత్యసాయి జిల్లా ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేసారు. దీంతో సత్యనారాయణ ను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు, బ్యాంకు ద్వారా పెద్ద మొత్తంలో సత్యనారాయణ అకౌంటుకు ట్రాన్స్ఫర్ అయినట్లు గుర్తించారు. సత్యనారాయణ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పుట్టపర్తి లో ఇంత పెద్ద మొత్తంలో విదేశీయులు మోసగించిన సత్యనారాయణ పై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా 70 కోట్ల వరకు ట్రాన్సాక్షన్స్ జరిగినట్టు సత్యసాయి జిల్లా పోలీసులు గుర్తించారు. పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ వివరాలను వెల్లడించారు. విదేశీయులు చెందిన మరి కొంతమంది బాధితులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్టు సమాచారం

## కడపలో జరిగిన మహానాడు అట్టర్ ప్లాప్ : శ్రీకాంత్ రెడ్డి

కడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు అట్టర్ ఫ్లాప్‌గా మిగిలిపోయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడానికే మహానాడు పరిమితమైందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఏం మంచి చేశారో చెప్పుకోలేని అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. గత అయిదేళ్ళ పాలనలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన విశ్వసనీయత వైఎస్ జగన్‌దేనని అన్నారు.

# కడప మహానాడు సూపర్ సక్సెస్



కడప, మే 30, పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి కడప నగరంలో నిర్వహించిన మహానాడు సూపర్ సక్సెస్ అని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన మహానాడులతో పోలిస్తే కడప మహానాడు బెస్ట్ అంటున్నారు వారు. కడపలో మహానాడు ఎనౌన్స్ చేసినప్పటి నుంచి చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించిన తెలుగుదేశం అధిష్టానం కొన్ని కీలకమైన మార్పులను ఈసారి తీసుకొచ్చింది. దానికి తోడు వాతావరణ పరిస్థితులు కూడా కలిసి రావడంతో మహానాడు కారణం అంటున్నారు ఆర్గనైజర్స్. సాధారణంగా మహానాడు అంటేనే నేతల ప్రసంగాలతో నిండిపోతుంది. అధినేత దృష్టిలో పడాలని ప్రతీ నాయకుడూ వారిని పొగడ్తలతో ముంచుతూ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తూ ఉంటారు. ఈసారి ఆర్గనైజర్స్ అలాంటి వాటికి చెక్ పెట్టారు. అధినేత చంద్రబాబు సహా వక్తలందరూ మహానాడు ఎజెండాకు మాత్రమే కట్టుబడి ఉన్నారు. మితిమీరిన పొగడ్తలు లేకుండా వారి ప్రసంగాలు సాగాయి. ఈసారి మహానాడు ఆర్గనైజింగ్ కమిటీల్లో ప్రధాన పాత్ర వహించింది ఎక్కువ శాతం యువకులే. ముఖ్యంగా లోకేష్ టీం

### తెలుగు తమ్ముళ్లలో జోష్

ఈసారి ఆర్గనైజింగ్ బాధ్యతలు వహించింది. కడపలో తొలిసారి జరుగుతున్న మహానాడు కావడంతో ఎలాగైనా దీన్ని సక్సెస్ చేసేలా ఎక్కడా సమన్వయ లోపాలు లేకుండా జాగ్రత్త వహించారు. ఎక్కడికక్కడ వాలంటీర్లకు బాధ్యతలు అప్పజెప్తూ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పెద్ద సంఖ్యలో వచ్చిన టిడిపి కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. దీనికోసం సాంకేతిక సహాయం ఎక్కువగా వాడుకున్నారు. ఈసారి మహానాడులో టెక్నాలజీని బలంగా వాడుకున్నారు ఆర్గనైజర్స్. ఎంతెలా అంటే సంప్రదాయబద్ధంగా ఎప్పుడూ ఏర్పాటు చేసే సీనియర్ ఎన్టీఆర్ ఫోటో గ్యాలరీ కూడా డిజిటల్ రూపంలో నిర్వహించారు. వాకీ టాకీలు డ్రోన్ల సాయంతో ఎక్కడ ఎవరికి ఇబ్బంది అనిపించినా వెంటనే అడ్రస్ చేస్తూ మూడు రోజుల పసుపు పండుగ సజావుగా సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంతకుముందు జరిగిన వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు మహానాడుల్లో ప్రధానంగా కనిపించిన సమస్య ట్రాఫిక్. అవన్నీ టౌన్‌కి దగ్గర్లోనో సిటీ మధ్యనో జరగడంతో సాధారణ ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొనే వారు. కానీ కడపలో మాత్రం ఆ సమస్య ఎదురు కాలేదు. టౌన్‌కి ఏడు కిలోమీటర్ల దూరంలోని ఒక లూప్ లైన్‌లో మహానాడు ఏర్పాటు చేయడం వల్ల కడప ప్రజలు ఈ మూడు రోజులు ట్రాఫిక్ సమస్య వల్ల ఇబ్బందులు పడలేదు. ఈ మహానాడు ప్రత్యేకతల్లో ఇదొకటిగా చెప్పుకోవచ్చు. ఈ మహానాడులో కడప, రాయలసీమ అభివృద్ధికి పెద్దపేట వేసేలా నేతల ప్రసంగాలు సాగాయి. కడప స్టీల్ ప్లాంట్ పనులు మరో 10 రోజుల్లో మొదలుపెడతామని చంద్రబాబు స్వయంగా హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం బనకచర్ల నదుల అనుసంధానంపై మరోసారి భరోసా ఇచ్చారు. అంతేకాదు మహానాడు సంప్రదాయానికి వ్యతిరేకంగా భోజనాల్లో రాయలసీమ ప్రజల కోసం నాన్ వెజ్ ను చేర్చారు. ఈసారి మహానాడు ఇంత సక్సెస్ కావడానికి ప్రధానమైన కారణం వాతావరణం. ఎన్టీఆర్ జన్మదినం మే 28 సందర్భంగా జరిగే మహానాడు ఎప్పుడూ వేసవి తాపానికి గురవుతూనే ఉంటుంది. రాజమండ్రి విజయవాడ ఒంగోలులో జరిగిన మహానాడు సమయంలో ఎండ వల్ల అందరూ తీవ్ర ఇబ్బందులు పాల య్యారు. కానీ విచిత్రంగా ఈసారి కడప మహానాడుకు వాతావరణం పూర్తిగా అనుకూలించి ంది. 26వ తారీఖున వర్షం కురిసి నిర్వాహకులను భయపెట్టినా తర్వాత మూడు రోజులు ఆహ్లాదకర వాతావరణమే ఉండడంతో టిడిపి కార్యకర్తలు అందరూ చక్కటి వాతావరణంలో గడిపారు. వరుస స్పీచ్‌లు వినబడుతున్నా సభ ప్రాంగణం వదిలి ఎవరూ బయటికి వెళ్లలేదు. దానితో చివరి రోజున సభకు టిడిపి నేతలు ఊహించిన దానికంటే ఎక్కువ మంది పసుపు తమ్ముళ్లు బహిరంగ సభకు హాజరై మహానాడు ను సూపర్ సక్సెస్ చేశారని పార్టీ అధినాయకత్వం సంతృప్తి గా ఉంది.

# కడప కో రూల్.. విజయవాడ కో రూలా...

విజయవాడ, మే 30, జిల్లాల పేర్ల వ్యవహారంలో వైసీపీ హయంలో జరిగిన పొరపాట్లే కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్నాయి. ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా జిల్లాల విభజన, వాటి పేర్లను నిర్ణయిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని కూటమి ప్రభుత్వం సరిచేసే ప్రయత్నాలు చేయడం లేదు. వైసీపీ హయాంలో జిల్లాల విభజన, జిల్లాల పేర్ల మార్పులు విషయంలో నాటి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించింది. చారిత్రక నేపథ్యం, పురాతన వారసత్వం, స్థానిక ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా రాజకీయ కారణాలతో జిల్లాల విభజన ఎడాపెడా చే సేశారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అప్పట్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించినపుడు ప్రధానంగా లోక్‌సభ నియోజక వర్గాలను ప్రాతిపదికగా చేసుకున్నారు. కడపను వైఎస్సార్ కడపగా మార్చిన ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాను మాత్రం విస్మరించింది. ఈ క్రమంలో జిల్లాలు, స్థానిక మండలాల్లోని గ్రామాల్లో ప్రజలకు ఉన్న అనుబంధాలను పోగొట్టుకోవాల్సి వచ్చింది. పార్లమెంటు నియోజక వర్గాలు వేర్వేరుగా ఉన్నా ఉమ్మడి జిల్లాలకు మాత్రం ఐదారు దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చాయి. జిల్లాల సరిహద్దుల విభజనలో ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో సగటున 16-17 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండేవి. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తూర్పు కృష్ణాలోని మచిలీపట్నం పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో 7 సెగ్మెంట్లు, విజయవాడ పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండేవి. జిల్లాల ఏర్పాటులో తూర్పు కృష్ణాను కృష్ణా జిల్లాగా, విజయవాడను ఎన్టీఆర్ జిల్లాగా విభజించారు. జిల్లాలోని కైకలూరు, నూజివీడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఏలూరు పార్లమెంటు పరిధిలో ఉండేవి. దీంతో ఆ రెండు నియోజక వర్గాలను ఏలూరు జిల్లాలో కలిపేశారు. దీంతో కొల్లేరు ప్రాంతానికి కృష్ణా జిల్లాతో ఉన్న బంధం తెగిపోయింది. నూజివీడును విజయవాడకు దూరం చేసేశారు. చివరకు విజయవాడ నగరం పక్కనే ఉండే గన్నవరం విమానాశ్రయం కూడా కృష్ణా జిల్లాలో కలిసిపోయింది. విజయవాడ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ఉన్న విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజక వర్గాలతో పాటు మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ నియోజక వర్గాలతో ఎన్టీఆర్ జిల్లాగా కొత్త జిల్లాను వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. విజయవాడ నగరానికి ఉన్న ఘనకీర్తిని మసకబార్చేలా వ్యవహరించారు. చారిత్రకంగా నదీతీరాల్లో విలసిల్లిన నగరాల్లో విజయవాడ ఒకటి. అందుబాటులో ఉన్న శాసనాల్లో శాతవాహనుల కాలం నుంచి విజయవాడ ప్రస్తావన చరిత్రలో ఉంది. కృష్ణానదికి ఉత్తరం వైపున ఉన్న విజయవాడ నగరం ప్రస్తావన అనే శాసనాల్లో వెలుగు చూసింది. చరిత్రలో కృష్ణానదీ తీరంలో విలసిల్లిన విజయవాడ నగరం ఘనమైన వారసత్వాన్ని లేకుండా చేశారు. రాజకీయంగా ప్రత్యర్థుల్ని ఇరకాటంలో పెట్టడానికే ఎన్టీఆర్ పేరును జిల్లాకు పెట్టేశారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో విజయవాడ ప్రస్తావన శాతవాహనుల కాలం నుంచి శాసనాల్లో కనిపిస్తుంది. అయా కాలాలను బట్టి రకరకాల పేర్లతో విజయవాడ నగరాన్ని శాసనాల్లో ప్రస్తావించారు. అందుబాటులో ఉన్న చరిత్ర ఆధారాలతో మధ్యాంధ్ర యుగంలో ప్రముఖ శైవమత క్షేత్రాల్లో ఒకటిగా విజయవాడ నగరం ప్రసిద్ధి పొందింది. బెజవాడ పేరును ప్రస్తావిస్తూ ఆయా కాలాల్లో పాలకులు, మాండలీకులు నుంచి సామాన్యుల వరకు వేయించిన శాసనాల్లో విజయవాడ పేరును పలు రకాలుగా పేర్కొన్నారు.

ఇలా బెజవాడచారిత్రకంగా ఇన్ని విధాలుగా వ్యవహరించబడి, చివరికి విజయవాడగా ప్రసిద్ధిపొందింది. ఇవి కాకుండా అమ్మవారిని కొలువైన బెజవాడను బీజవాటిక, బీజపురి, బెజ్జంవాడ, చోళరాజేంద్రపురం, అర్జునపురి, ఆంగ్లేయుల పాలనలో బ్లేజ్‌వాడగా కూడా పేర్కొన్నారు. బెజవాడ ఎండల్ని తాళలేక ఆంగ్లేయులు బ్లేజ్‌వాడగా పేర్కొన్నప్పటికీ బెజవాడ నామానికి దానికి సంబంధం లేదు. జిల్లాల విభజన సమయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించిన సమయంలో విజయవాడ జిల్లాగా ప్రకటించాలని స్థానికులు, విద్యావంతులు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పట్లో దానిని వైసీపీ ఖాతరు చేయలేదు. రాజకీయ కారణాలతో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరు తారక రామారావు పేరుతో జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తొలగించుకునే క్రమంలో ఎన్టీఆర్ పేరుతో జిల్లా పేరును ప్రకటించారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఎన్టీఆర్ జన్మించిన కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టాల్సి ఉన్నా అప్పట్లో జగన్ ప్రభుత్వం అలా చేయలేదు. ఏపీలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లా, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరుతో ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. మాజీ సీఎం వైఎస్ మరణం తర్వాత కడప జిల్లా పేరుకు ముందు వైఎస్సార్ పేరును చేర్చారు. జిల్లాల పునర్విభజన సమయంలో వైఎస్సార్ కడప కాస్త వైఎస్సార్ జిల్లాగా మారింది. విజయవాడ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ఏర్పాటైన జిల్లాకు మాత్రం ఎన్టీఆర్ పేరును పెట్టారు. మిగిలిన చోట్ల పార్లమెంటు నియోజక వర్గ కేంద్రాలతోనే జిల్లాలు ఏర్పాటు చేశారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తమైనా నాటి ప్రభుత్వం ఖాతరు చేయలేదు. కడపలో మహానాడు కార్యక్రమం ప్రారంభించడానికి ఒక్క రోజు ముందే వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా పేరు విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకప్పుడు విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న విజయవాడ విమానాశ్రయాన్ని కూడా పక్క జిల్లాలోకి వెళ్లిపోయింది. కూటమి ప్రభుత్వంలో జిల్లా సరిహద్దులు, పేరు విషయంలో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు వచ్చినా పరిష్కృతం కాలేదు. జిల్లా పేర్లు మార్పు వెనుక ప్రభుత్వానికి దురుద్దేశాలు లేకుంటే, సెంటిమెంట్ ప్రకారం పాత జిల్లా పేర్లు కొనసాగించాలని కోరిక ఉంటే, విజయవాడ నగరానికి ఔఖీ జిల్లాగా కాకుండా, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ కడప జిల్లాగా మార్చినప్పుడు .. ఎన్టీఆర్ జిల్లాను ఔఖీ విజయవాడ జిల్లాగా మారిస్తే తప్పేంటని షర్మిల ప్రశ్నించారు.

# 12లోపు 15 వేలు

ఒంగోలు, మే 30, తల్లికి వందనం పథకం అమలుపై కడప మహానాడులో సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. బడులు తెరిచే లోపే ఈ స్కీమ్ ను అమలు చేస్తామన్నారాయన. ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం చెల్లిస్తామని మరోసారి స్పష్టం చేశారు చంద్రబాబు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక సీమ్స్ లో తల్లికి వందనం ఒకటి. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం ద్వారా రూ.15వేల ఆర్థిక సాయం అందిస్తామంది. ఈ పథకాన్ని పాఠశాలల ప్రారంభానికి ముందే అమలు చేయాలని కూటమి సర్కార్ భావిస్తోందిజూన్ లో స్కూల్స్ తెరుచుకుంటాయి. ఆ లోపే అనగా జూన్ 12న ఈ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. ఇన్నాళ్లు తల్లికి వందనం పథకం డబ్బులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఊరట లభించినట్లయింది. సీఎం చంద్రబాబే స్వయంగా జూన్ లో పథకాన్ని అమలు చేస్తామని చెప్పడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తల్లికి వందనం స్కీమ్ ద్వారా ప్రతీ విద్యార్థికి సంవత్సరానికి రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పారు. దీంతో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ.. అంటే ఇంటర్ వరకూ చదివే పిల్లలందరికీ రూ.15వేలు చొప్పున వారి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుంది. తల్లికి వందనం పథకం అమలు కోసం 2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వం.. రూ.9407 కోట్లు కేటాయింపులు చేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో దాదాపు 81 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో సుమారు 69.16 లక్షల మంది ఈ పథకానికి అర్హులని విద్యాశాఖ తేల్చింది. తల్లికి వందనం పథకానికి అర్హులు కావాలంటే.. విద్యార్థులు కచ్చితంగా 75 శాతం అటెండెన్స్ నిబంధన పాటించాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. వారికే దీన్ని వర్తింపజేయనున్నారని సమాచారం. వైసీపీ సర్కార్ అమ్మఒడి పేరుతో ఈ స్కీమ్ ను అమలు చేసింది. ఇంట్లో చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నా.. ఒకరు మాత్రమే ఈ పథకానికి అర్హులు.

# రేషన్ వ్యవస్థలో మార్పులు

రాజమండ్రి, మే 30, వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ సరఫరా లో సమూల మార్పులు జరిగాయి. అప్పటివరకు డీలర్ల వద్ద అందిస్తున్న సరుకులు ఇంటింటా పంపిణీ చేయడం ప్రారంభించారు. తొలుత ఆ బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు ఏపీలో రేషన్ కార్డు లబ్ధిదారులకు కీలక సూచనలు వచ్చాయి. జూన్ 1 నుంచి రేషన్ పంపిణీలో మార్పులు జరగబోతున్నాయి. ఇకనుంచి ఎండియూ వాహనాల ద్వారా కాకుండా పాత విధానంలోనే డీలర్ల వద్ద రేషన్ సరుకులు పొందాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటి వద్దకే సరుకులు తెచ్చి అందిస్తారు. అంతేకాకుండా ఆదివారాల్లో కూడా రేషన్ షాపులు తెరిచి ఉంటాయని.. ఈ మార్పులను గమనించాలని ప్రభుత్వం చెబుతోంది. ఇదే విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఫుల్ క్లారిటీ ఇచ్చారు. విజయవాడలో పర్యటించిన షాపులో ఈపాస్ మిషన్ పనితీరును పరిశీలించారు. ఎం డి యు వాహనాలను రద్దు చేశామని.. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 29,760 రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ సరఫరా లో సమూల మార్పులు జరిగాయి. అప్పటివరకు డీలర్ల వద్ద అందిస్తున్న సరుకులు ఇంటింటా పంపిణీ చేయడం ప్రారంభించారు. తొలుత ఆ బాధ్యతను వలంటీర్లకు అప్పగించారు. అయితే రేషన్ ఇంటింటా సరఫరాకు గాను ఎండియు వాహనాలను తెరపైకి తెచ్చారు. ప్రతినెలా ఈ వాహనాలకు రూ.21 వేలను ప్రభుత్వం చెల్లించేది. అయితే డీలర్లకు కమిషన్ తో పాటు ఎండియు వాహనదారులకు సైతం భారీగా అద్దెలు చెల్లించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ ఐదేళ్లలో ఎండియు వాహనాలకే దాదాపు 500 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. అయితే ఈ విధానంపై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. ఎండియు వాహనాల ద్వారా భారీగా బియ్యం పక్కదారి పట్టినట్లు విమర్శలు ఉన్నాయి. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పాత విధానంలోనే రేషన్ అందించేందుకు నిర్ణయించింది. ఎండియు వాహనాలవినియోగానికి సంబంధించి కూటమి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నెల నుంచి ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరఫరా ఉండదని తేల్చి చెప్పింది. పాత విధానంలోనే రేషన్ డీలర్ల ద్వారా డిపోల వద్ద రేషన్ విడిపించుకోవాలని సూచించింది. అందుకు సంబంధించి సమయపాలన కూడా అమలు చేయనుంది. ఈ మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్ దీనిపై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే వాహనాల ద్వారా రేషన్ అందించేవారని.. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఈ మార్పు చేసినట్లు తెలిపారు. ఇకనుంచి రేషన్ డిపోల ద్వారా ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు. మరోవైపు ఎండియు వాహనదారులు తీవ్ర ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వారి విషయంలో కూడా ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# కోవర్టులు వారేనా

గుంటూరు, మే 30, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొందరు ప్రత్యర్థులతో చేతులు కలిపి మన మధ్య కోవర్టులుగా ఉంటున్నారని అన్నారు. వాళ్ళ ప్రోత్సాహంతో హత్యా రాజకీయాలు చేస్తున్నారంటూ చంద్రబాబు మండిపడ్డారు. అందుకే తాను ఇప్పుడు ఎవరినీ నమ్మడం లేదన్నచంద్రబాబు నాయుడు ఇలాంటి తప్పుడు పనులు చేసే ఏ కార్యకర్తను కూడా వదిలిపెట్టనంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వార్నింగ్ ఇచ్చారు. ఎందుకంటే టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు, నేతలే హత్యకు గురవుతుండటం పార్టీ అధినేతకు ఆందోళన కలిగించే విషయమే. ఎందుకంటే వైసీపీ హయాంలో కంటే తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే టీడీపీ కార్యకర్తలు వరసగా హత్యకు గురి కావడం పట్ల చంద్రబాబు ఆందోళన చెందుతున్నట్లు కనపడుతుంది. ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి హత్య కేసులోనూ టీడీపీకి చెందిన వారే ఉన్నారని తేలింది. దీంతో పాటు ఒకే సామాజికవర్గానికి చెందిన వారి మధ్య తలెత్తిన విభేదాలు హత్యకు దారి తీశాయి. వీరయ్య చౌదరిని హత్య చేసింది వైసీపీ నేతలంటూ తొలుత ప్రచారం జరిగినా తర్వాత వారంతా టీడీపీలో ఉన్న వారే అని తేలడంతో పార్టీ అధినాయకత్వం అవాక్కయింది. అయితే కేవలం వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు, ఆధిపత్య పోరుతోనే ఈ హత్య జరిగిందని తెలిసిన తర్వాత మౌనం వహించక తప్పలేదు. చిన్న వయసులోనే వీరయ్య చౌదరి లాంటి నేతను కోల్పోవడంతో ఆవేదనలో ఉన్న అధినాయకత్వం నియోజకవర్గాల్లో మద్యం, ఇసుక, మైనింగ్ విషయాల్లోనే ఎక్కువ ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తించారు. ఇక ప్రత్యర్థులకు చుక్కలే పల్నాడు జిల్లాలో జంట హత్యలు... ఇక తాజాగా పల్నాడు జిల్లాలోనూ ఇద్దరు టీడీపీ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. ఈ హత్యకు కారణం టీడీపీ వారేనని తొలుత జిల్లా ఎస్పీ ప్రకటించినప్పటికీ తర్వాత పల్నాడు ప్రాంత వైసీపీ నేతలు పిన్నెల్లి సోదరులపై కేసు నమోదు చేశారు. అయితే దీనిని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారంటున్నారు. తమ పార్టీకి చెందిన కార్యకర్తలు కోవర్టులుగా మారి ప్రత్యర్థి పార్టీల నేతలతో చేతులు కలుపుతూ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు నమ్మారు. అందుకే ఈ హత్యల్లో నేరుగా వైసీపీ వారి ప్రమేయం లేకపోయినా పరోక్షంగా ఉందని భావించిన చంద్రబాబు పార్టీలో కోవర్టులున్నారంటూ వారికి వార్నింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారు. కేవలం కార్యకర్తలకు వార్నింగ్ ఇస్తేనే సరిపోతుందా? లేక నేతలకు కూడా కాస్త జాగ్రత్తగా ఉండాలని చెప్పాలి కదా? అన్న కామెంట్స్ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి.

# కృష్ణానదికి పోటెత్తున్న నీరు



విజయవాడ, మే 30,నైరుతి రుతుపవనాలు ముందే రావడంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నైరుతి రుతుపవనాలు రాక ముందే కర్ణాటక మహారాష్ట్రలో అకాల వర్షాలు దంచి కొట్టాయి. వీటికి తోడు రుతుపవనాలు రావడంతోవర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో మే నెలలో కురిసిన అకాల వర్షాలు చెరువులు, నదులు ఎండిపోతున్నాయి. కొన్ని రోజులుగా కర్ణాటక, మహారాష్ట్ర,కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం కృష్ణా నది పై ఉన్న జూరాల డ్యామ్ శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతుంది. వచ్చే ఎన్నికల్లోనూ మనదే జయం జూరాల ప్రాజెక్టుకు... తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న జూరాల ప్రాజెక్టు కు గత మూడు రోజులుగా వరద నీరు పోటెత్తుతుంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 3,258 క్యూసెక్కులు ఉండగా ఔట్ ఫ్లో 805 క్యూసెక్కులుగా ఉంది. కంటిన్యూగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా.. ప్రస్తుతం 318.490 మీటర్లకు చేరుకుంది. అలాగే పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంలీలు కాగా.. ప్రస్తుతం 5.928 టీఎంసీలుగా కొనసాగుతోంది. ప్రస్తుతం వస్తున్న వరద ఇలానే కొనసాగితే మరో వారం రోజుల్లో జూరాల డ్యామ్ పూర్తి స్థాయికి నిండి గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఇక ప్రత్యర్థులకు చుక్కలే ఎగువన కురుస్తున్న వర్షాలకు... ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఉప నదులకు వరద నీరు పోటెత్తడంతో.. శ్రీశైలం జలాశయానికి వరద తాకిడి పెరిగింది. ప్రతి సంవత్సరం జులై నెలలో వరద ప్రారంభం అవ్వనుండగా ఈ సారి అకాల వర్షాల కారణంగా ముందస్తుగానే శ్రీశైలం డ్యామ్ కు వరద వచ్చి చేరుతుంది. నిన్న ఉదయానికి ఎగువ నుంచి 4,462 క్యూసెక్కుల వరద వస్తుండగా 19,070 క్యూసెక్కులు ఔట్ ఫ్లో దిగువకు వెళ్తుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 817.20 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి ముందస్తుగానే వరద ప్రారంభం కావడంతో అప్రమత్తమైన అధికారులు ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు.

# అతివేగంతో డివైడర్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి

విశాఖ,రాష్ట్రంలో రోజురోజుకీ రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి ఈ ప్రమాదాల్లో అనేకమంది కుటుంబాలకు దూరం అవుతున్నారు త్వరగా వెళ్లిపోవాలని తాపత్రయంతో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనదారులు గమ్యస్థానంలో చేరడానికి అతివేగంతో వెళ్తున్నారు దీంతో అనేక ప్రమాదానికి గురై అక్కడకే మరణించిన సంఘటనలు చాలా చోటు చోటుచేసుకున్నాయి విశాఖ నగరంలో అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది తెలుగు తల్లి ఫ్లైఓవర్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు డివైడర్ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు సంఘటన స్థలం చేరుకున్న పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు

# స్లిమ్ గా కావాలని చూస్తున్నారా? అయితే కొబ్బరినూనె మ్యాజిక్ ట్రై చెయ్యండి!



ఆరోగ్యంగా ఉండాలని ఎవరి కోరుకోరు? ఈ భూమి మీద ఉన్న ప్రతి ఒక్కరు ఆరోగ్యంగాను, అందంగా ఉండాలని కోరుకుంటారు. అంతేకాదు నాజుగ్గా ఉండాలని కూడా కోరుకుంటారు. అటువంటివారు బరువు తగ్గడం కోసం ఎన్నెన్నో చేస్తూ ఉంటారు. జిమ్ కు వెళ్లడం, డైట్ ఫాలో అవ్వడం ఇలా ఎన్ని చేసినప్పటికీ మంచి ఫలితం రాదు అటువంటివారు కొబ్బరినూనె మీ శరీరంపైన బరువు తగ్గడం కోసం చేసే మ్యాజిక్ తెలిస్తే అస్సలు వదిలిపెట్టరు. కొబ్బరినూనెలో ఫుల్ పోషకాలు కొబ్బరి నూనెలో చాలా పోషకాలు ఉంటాయి. కొబ్బరి నూనె శరీరానికి కావలసిన ఎన్నో మంచి గుణాలతో సమ్మిళితమై ఉంటుంది. కొబ్బరి నూనెలో మోనో అన్సాచ్యురేటెడ్ కొవ్వు ఆమ్లాలు చాలా ఉంటాయి. ఇవి ఆహారంలో అదనపు కొలెస్ట్రాల్ ను తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. సహజంగా కొబ్బరి నూనె జుట్టు ఆరోగ్యానికి మాత్రమే ఉపయోగిస్తారు కానీ వంటకు కొబ్బరి నూనెను ఉపయోగించడం ఎంతో మంచిది. బరువు తగ్గాలంటే కొబ్బరి నూనె ఇలా తీసుకోవాలి చాలా ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె వినియోగం వల్ల బరువు బాగా తగ్గే అవకాశం ఉంటుంది. కొబ్బరి నూనెను పరగడుపున తీసుకుంటే నెలరోజుల్లో మీ శరీరంలో చాలా మంచి మార్పు వస్తుంది. కొబ్బరినూనె బొద్దు కొవ్వును తగ్గిస్తుందని చెప్తారు. బరువు తగ్గాలనుకునేవారు కొబ్బరినూనెను ఏ విధంగా తీసుకోవాలి అంటే ఖాళీ కడుపుతో ప్రతిరోజు ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. కొబ్బరి నూనెతో చర్మం కాంతివంతం కొవ్వు త్వరగా తగ్గుతుంది. గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ కొబ్బరినూనె కలుపుకుని తాగినా మంచి ప్రయోజనం ఉంటుంది. దీనిని ప్రతిరోజు కచ్చితంగా పాటించటం వల్ల శరీరంలో పేరుకుపోయిన చెడు కొవ్వు నుండి విముక్తి లభిస్తుంది. ఒకే నెలలో మూడు కిలోల వరకు బరువు తగ్గడానికి అవకాశం ఉంటుంది. కొబ్బరినూనె మన చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. కొబ్బరినూనె ఇలా తీసుకున్నా లాభమే మనం తినే ఆహారంలో ఉండే చెడు కొవ్వులు మన శరీరంలో పేరుకుపోయి బరువు పెరగడానికి కారణమవుతాయి. అయితే కొబ్బరి నూనెలో ఉండే ట్రై గ్లిజరైడ్స్ ఇతర కొవ్వుల కంటే ఆరోగ్యకరంగా ఉంటాయి. ఇక కొబ్బరి నూనెను తేనెతో కలిపి రోజుకు మూడు నాలుగు సార్లు తీసుకోవడం కూడా ప్రయోజనం ఇస్తుంది.

# తరచూ శుభ్రం చేయకూడని శరీరభాగాలివే!

ప్రతి ఒక్కరు శుభ్రంగా ఉండాలి. అయితే శుభ్రత పేరుతో పొద్దుకు పది సార్లు స్నానం చేసేవారు ఉంటారు. ఇది ఏమాత్రం మంచిది కాదని చెబుతున్నారు వైద్యనిపుణులు. మన శరీరంలో కొన్ని భాగాలను ఎక్కువగా శుభ్రం చేయకూడదని, వాటికి ఎక్కువగా శుభ్రం చేయడం వల్ల అనేక అనారోగ్యసమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని, ఆయా శరీరభాగాల సెన్సిటివిటీ పెరుగుతుందని చెబుతున్నారు. మరి ఎటువంటి శరీరభాగాలను ఎక్కువ శుభ్రం చేయకూడదనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ముఖాన్ని పదేపదే కడుగుతున్నారా? చాలామంది ముఖం తెల్లగా ఉండాలని, నిగారింపును సొంతం చేసుకోవాలని పదేపదే ముఖాన్ని సబ్బుతో రుద్దుతూ కడుగుతూ ఉంటారు. ఇలా ముఖాన్ని పదేపదే శుభ్రం చేయడం మంచిది కాదు. రోజుకు రెండు సార్లు ముఖం కడుక్కుంటే సరిపోతుంది కానీ తరచూ ముఖాన్ని స్క్రబ్ చేయడం వల్ల ధర్మంలో ఉన్న సహజ నూనెలు తొలగిపోయి ముఖం అందవిహీనంగా తయారవుతుంది. కనుక ముఖాన్ని పదేపదే ఎక్కువసార్లు రుద్ది శుభ్రం చేయకండి.“ ఈ శరీర భాగాన్ని ఎక్కువ శుభ్రం చేస్తే జరిగేదిదే ఇక ముక్కు లోపలి భాగాన్ని కూడా మనం ఎక్కువసార్లు శుభ్రం చేయకూడదు. ముక్కు లోపలి భాగంలో గాలిని శుభ్రపరిచే తేమను అందించే ఒక పొర ఉంటుంది. దీనిని ఊరికే ఎక్కువసేపు నీళ్లతో శుభ్రం చేస్తే ఈ పొర దెబ్బతిని, శుభ్ర పరిచే ఫిల్టర్ దెబ్బ తింటుంది. దీనివల్ల గాలిలో ఉన్న దుమ్ము చూడు ఈజీగా లోపలికి వెళుతుంది. ఈ శరీర భాగం విషయంలో జాగ్రత్త ఇక ఎక్కువగా శుభ్రం చేయకూడని శరీర భాగాలలో జననేంద్రియాలు కూడా ఒకటి. ఇవి చాలా సున్నితంగా ఉంటాయి. ఎక్కువసేపు సబ్బుతో రుద్దుతూ, నీళ్లతో తరచూ శుభ్రం చేస్తే దానికి ఉండే పీహెచ్ స్థాయిలు దెబ్బతింటాయి. సాధారణంగా ఒకటి రెండుసార్లు జననేంద్రియాలను శుభ్రం చేసుకోవచ్చు. కానీ పదే పదే సబ్బు రుద్దుతూ జననేంద్రియాలను శుభ్రం చేయడం మంచిది కాదు. ఎక్కువ శుభ్రం చేయకూడని శరీర భాగాలివే చాలామంది పాదాల మధ్య భాగంలోనూ, కంటి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని తరచూ శుభ్రం చేస్తూ ఉంటారు. ఇలా శుభ్రం చేయడం కూడా మంచిది కాదు. కంటి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఎక్కువసేపు నీటితో శుభ్రం చేస్తే ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది పాదాల మధ్య భాగం కూడా చాలా సున్నితంగా ఉంటుంది. దానిని కూడా ఎక్కువసేపు రుద్దుతూ శుభ్రం చేయకూడదు. ఎక్కువసేపు రుద్దితే మురికి పోతుందని అనుకుంటే అది పొరపాటు. శరీరంలోని భాగాలను వాటి సున్నితత్వాన్ని దృష్టిలో పెట్టుకుని మాత్రమే శుభ్రం చేసుకోవాలి.



# అందంతో పాటు ఆరోగ్యం కావాలంటే ఈ జ్యూస్ తాగండి!



సహజంగా ఆకుకూరల్లో లభించే పోషకాలు, మిటమిన్లు ఇతర ఏ కూరగాయల్లోనూ అంతగా లభించవు. ఆకు కూరలు తినడం ఆరోగ్యానికి మంచిది అని డాక్టర్లు చెబుతుంటారు..మరి అవే ఆకు కూరలను జ్యూస్ చేసుకొని తాగితే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఆకుకూరలలో పాలకూరకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. పాలకూర పుష్కలంగా పోషకాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. పాలకూర జ్యూస్ తో ఈ సమస్యలకు చెక్ పాలకూరను జ్యూస్ చేసుకొని తాగడం వలన మనకు పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లు కావలసినన్ని లభిస్తాయి.. ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి ఉపయోగపడతాయి ,చర్మం పొడిబారకుండా ,ముడతలు రాకుండా కాపాడతాయి. పాలకూరలో మిటమిన్ ఏ కంటి చూపు సమస్య ఉన్నవారికి, రే చీకటితో బాధపడేవారికి ఉపయోగపడుతుంది . కాబట్టి పాలకూర జ్యూస్ తాగడం వలన ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చు. పాలకూర జ్యూస్ తో హైబీపీ నియంత్రణ పుట్టిన పసి పిల్లలకు పాలిచ్చే తల్లులకు పాల ఉత్పత్తి పెరగడం కోసం పాలకూర జ్యూస్ తాగితే ప్రయోజనం ఉంటుంది. పాలకూర జ్యూస్ వలన పాల ఉత్పత్తి పెరుగుతుంది.. పాలకూర జ్యూస్ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందడమే కాకుండా రక్తపోటు సమస్యతో బాధపడేవారికి ఉపశమనం కలుగుతుంది. పాలకూరలో పొటాషియం, మెగ్నీషియం , ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి . ఇది హైపర్ టెన్షన్ ను తగ్గిస్తుంది గుండె ఆరోగ్యానికి పాలకూర జ్యూస్ మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని అరికడుతుంది. కాలేయ వ్యాధులను దూరం చేస్తుంది. మలబద్ధక సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. పాలకూర జ్యూస్ ను డైలీ కాకపోయిన్ వారంలో ఒకటి రెండు సార్లు తాగితే క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ముందుగానే జాగ్రత్త పడొచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు. పాలకూర జ్యూస్ తాగటం గుండె సంబంధిత వ్యాధుల నుండి విముక్తి కలిగిస్తుంది. పాలకూర జ్యూస్ తో అందం, ఆరోగ్యం పాలకూర జ్యూస్ తో చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జుట్టుకు బలం చేకూరుతుంది. జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. త్వరగా వృద్ధాప్య ఛాయలు రాకుండా ఉంటాయి. పాలకూర జ్యూస్ మన చర్మం ముడతలు రాకుండా చేస్తుంది. అందం, ఆరోగ్యం రెండింటినీ ఇచ్చే పాలకూరను జ్యూస్ రూపంలోనూ, స్మూతీ రూపంలోనూ చేసుకుని తీసుకుంటే మంచిది.

# బియ్యం తింటున్నారా? ఇది తెలిస్తే అస్సలే తినరు!



చాలామందికి బియ్యం తినే అలవాటు ఉంటుంది. ఇంట్లో ఎన్ని తినే ఆహార పదార్థాలు ఉన్నప్పటికీ వారి మనసు బియ్యం మీదనే పోతూ ఉంటుంది. అటు ఇటు తిరుగుతూ కాసిన్ని బియ్యాన్ని నోట్లో వేసుకుని తింటూ ఉంటారు. కానీ ఇళ్లల్లో పెద్దవాళ్లు బియ్యం తినకూడదని పదేపదే చెబుతారు. అయితే ఈ విధంగా బియ్యాన్ని తినడం వల్ల ఏం జరుగుతుంది? బియ్యం తినే అలవాటు ఈ లోపంతోనే ఎందుకు మన పెద్దవాళ్లు బియ్యం తినకూడదని పదే పదే చెబుతారు? అసలు వద్దన్నా వాళ్ళు బియ్యం ఎందుకు తింటారు? అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. చాలామందిలో ఎవరు వద్దన్నా సరే బియ్యం తిని అలవాటు ఉంటుంది. పోషకాహార లోపం వల్లే ఈ సమస్య ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఐరన్ డెఫిషియన్సీ వల్ల, విటమిన్ బి12 శరీరంలో తక్కువగా ఉండడం వల్ల బియ్యాన్ని తినాలని చాలామంది ఫీల్ అవుతూ ఉంటారు “మజ్జిగన్నంలో పచ్చి ఉల్లిపాయ తింటున్నారా? ఇది తెలుసుకోండి” బియ్యాన్ని నేరుగా తింటే జరిగేదిదే బియ్యంలో మన శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు, క్యాల్షియం, ఫైబర్, ఐరన్, థియామిన్, రిబో ఫ్లేవిన్ తో సహా ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. అయితే బియ్యాన్ని పచ్చిగా తింటే మాత్రం అది ఏమాత్రం మనకు ఆరోగ్యాన్ని ఇవ్వదు. వండుకోకుండా బియ్యాన్ని నేరుగా తింటే ఎన్నో వ్యాధుల బారిన పడాల్సి వస్తుంది. వండుకోకుండా బియ్యాన్ని తినడం వల్ల జీర్ణ సమస్య వస్తుంది. బియ్యం తినే వారిలో ఈ అనారోగ్య సమస్యలు కడుపునొప్పితో బాధపడాల్సి వస్తుంది. బియ్యాన్ని నేరుగా తినడం వల్ల శారీరకంగా అలసట, బలహీనత వంటి సమస్యలు వస్తాయి. బియ్యం లో లెక్టిన్ అనే మూలకం ఎక్కువ మొత్తంలో ఉండడం వల్ల ఇది కడుపు ఉబ్బరాన్ని, మలబద్ధకాన్ని, కడుపునొప్పి వంటి సమస్యలను కలిగిస్తుంది. బియ్యం ప్రేగు కదలికలలో ఇబ్బందిని కలిగిస్తుంది. బియ్యాన్ని నేరుగా తినడం వల్ల మూత్రపిండాల సమస్యలు వస్తాయి. ఉనీజూజీశ్రీ ఎజీతీఎజీ: రామ్ గోపాల్ వర్మకు మూడు నెలల జైలు శిక్ష..! 5 5 నీరసం, రక్త హీనత సమస్యలతో ఇబ్బంది బియ్యం సులభంగా జీర్ణం కాదు కాబట్టి వీటిని తింటే వాంతులు, విరోచనాలు అయ్యే అవకాశం కూడా ఉంది..ఇక వీరు బియ్యం తినడం వల్ల రక్తంలోని తెల్ల రక్త కణాలు చనిపోతాయి. ముఖం పాలిపోతుంది. ఎప్పుడూ నీరసంగా డల్ గా తయారవుతారు. బియ్యం తినేవారిలో ఉత్సాహం లోపిస్తుంది. రక్తహీనత సమస్య వస్తుంది.

# రాత్రిపూట భోజనం చేయకుండా టిఫిన్ తింటున్నారా? ఇది తెలుసుకోండి!



ప్రస్తుత రోజుల్లో భోజనం చేయడాన్ని చాలామంది తగ్గించే స్తున్నారు. బిర్యానీలు అందుబా టులోకి వచ్చిన తర్వాత సమయవే ళలు లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు బిర్యానీలు.. అందులోను మాంసాహార బిర్యానీలు లాంగించేసి అనారోగ్యాలకు గురవుతున్నారు. కొంతమంది సమయం లేదని, మరికొందరు డైటింగ్ అంటూ రాత్రిపూట భోజనం మానేసి టిఫిన్ తింటుంటారు. ఆరోగ్య పరంగా ఇది చాలా క్లిష్టమైన విషయం. దీనివల్ల ప్రయోజనాలేమిటి? నష్టాలేమిటి? అనే విషయాలను తెలుసుకుందాం. భోజనం మానేయడంవల్ల కలిగే లాభాలు బరువు తగ్గడానికి సహాయపడుతుంది... రాత్రిపూట తినే ఆహారం సాధారణంగా జీర్ణం కాకుండా కొవ్వుగా మారిపోతుంది. అందుకే రాత్రి భోజనం మానేయడం వల్ల కొంతమేర బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మెరుగైన నిద్ర... రాత్రి భోజనం చేయకుండా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థ పనిభారం తగ్గుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది...“ప్రతిరోజు సబ్బుతోనే స్నానం చేస్తున్నారా?... ఇది తెలుసుకోండి!” రాత్రిపూట భోజనం మానేయడం వల్ల కలిగే నష్టాలు శక్తి లేకపోవడం... రోజంతా పనిచేసిన తర్వాత శరీరానికి శక్తి అవసరం. రాత్రి భోజనం మానేస్తే శరీరానికి కావాల్సిన శక్తి లభించదు. దీంతో మరుసటి రోజు ఉదయం నీరసంగా అనిపించవచ్చు. జీర్ణ సమస్యలు... రాత్రిపూట భోజనం మానేస్తే అజీర్తి, ఆమ్లం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పోషకాల లోపం... రాత్రి భోజనంలో అవసరమైన పోషకాలు లభించకపోతే శరీరానికి పోషకాల లోపం ఏర్పడుతుంది. రాత్రిపూట తేలికపాటి టిఫిన్ తీసుకోవడం మంచిది. ఏమేం తినాలి.. ఏమేం తినకూడదంటే ఒక గ్లాస్ పాలు తాగాలి. గుడ్డు తింటే మంచిది. మొక్కజొన్న, ఫ్రూట్ సలాడ్, మొక్కజొన్న రొట్టె లాంటివి తినొచ్చు. కారంగా ఉన్న ఆహారం, ఎక్కువగా నూనె వాడిన ఆహారం, మసాలా ఆహారం, చక్కెర అధికంగా ఉన్న ఆహారం తీసుకోకూడదు. రాత్రి 7.00 గంటల తర్వాత తినడం మంచిది కాదు. తక్కువ పరిమాణంలో తినడంతోపాటు త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినాలి. రాత్రిపూట భోజనం చేయడం లేదా మానేయడం అనేది వ్యక్తిగత నిర్ణయం.




# బన్నీ స్క్రిప్ట్ చరణ్ కాంపౌండ్ లో!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన సొంత నిర్మాణ సంస్థలో నిర్మించే దిశగా పావులు కదుపుతున్నట్లు తెరపైకి వచ్చింది. చరణ్ తో సినిమా తీయమని సలహా ఇచ్చింది కూడా తానేనని ప్రచారంలో ఉంది. పవన్ తో సినిమా తీయడం ఎలాగూ ఆలస్యమవుతుంది? అంతవరకూ గ్యాప్ ఎందుకు అన్న కోణంలో చరణ్ ని సెట్ చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. నట్టి కుమార్ దీంతో గురూజీ ఓ కొత్త కథతోనే చరణ్ ని అప్రోచ్ అయినట్లు తెలిసింది. కానీ అసలు సంగతేంటి? అంటే ఇది కొత్త కథ కాదు బన్నీ కోసం రాసిన స్క్రిప్ట్ నే గురూజీ వినిపించాడు? అన్నది తాజా అప్ డేట్. మెగా కాంపౌండ్ వర్గాల నుంచి ఈ సంగతి లీకైంది. వాస్తవానికి గురూజీ బన్నీతోనే సినిమా పట్టాలెక్కించాలి. ఆ ప్రాజెక్ట్ అధికారికంగానూ ప్రకటించారు. కానీ మధ్యలోకి అనూహ్యంగా అట్లీ రావడంతో? బన్నీ గురూజీని హోల్డ్ లో పెట్టాడు. అట్లీ సినిమా అయిన తర్వాత మనం చేద్దామన్నాడు. దీంతో త్రివిక్రమ్ కూడా సైలెంట్ అయిపోయాడు. ఈ గ్యాప్ లో గురూజీ విక్టరీ వెంకటేష్ తో సినిమా చేస్తాడనే ప్రచారం సాగింది. ఇది పక్కనబెడితే? అట్లీతో సినిమా తీయాలంటే ఎలాగైనా రెండేళ్ల సమయం పడుతుందన్న విషయం తెలియడంతో? గురూజీ మనసు మారిందన్నది తాజా సమాచారం. బన్నీ కోసం వెయిట్ చేయడం దేనికి అదే కథని రామ్ చరణ్ తో చేస్తే సరిపోతుందనే ఆలోచనకి వచ్చినట్లు తెలిసింది. ఇదే స్టోరీని చరణ్ కి వినిపించినట్లు కాంపౌండ్ వర్గాల నుంచి లీకైంది. ఆర్సీ 17 చిత్రంతోనే దీన్ని కూడా మొదలు పెడదామని చరణ్ భరోసా ఇవ్వడంతోనే గురూజీ కూడా స్ట్రాంగ్ గా ముందుకెళ్లారని సన్నిహిత వర్గాల సమాచారం. ఇప్పటికే ఆ రెండు కుటుంబాల మధ్య చిన్న పాటి మనస్పర్ధలున్నాయి. బన్నీ మామ మీడియా ముఖంగానే పవన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.‘ పుష్ప‘ రాజ్ పాత్ర విషయంలో తలెత్తిన వివాదం ఇది. అప్పటి నుంచి బన్నీ ఆ కుటుంబానికి దూరంగా ఉన్నట్లు ప్రచారంలో ఉండనే ఉంది.

# తెలుగమ్మాయికి అమెరికన్ మ్యూజిక్ అవార్డు!

నుదుటిన పెద్ద బొట్టు, భారతీయత ఉట్టిపడే ఆహార్యంతో పాటూ అమెరికన్ యాక్సెంట్ తో ర్యాప్ ప్రపంచంలో ఎంతో మంచి క్రేజ్ సంపాదించుకున్న రాజకుమారి అసలు పేరు శ్వేతా రావు ఎల్లాప్రగడ. ఆమె స్టేజ్ ఎక్కిందంటే అక్కడున్న ఆడియన్స్ మొత్తం ఉర్రూతలూగడం ఖాయం. ఓ వైపు ర్యాప్ తో పాటూ మరోవైపు హిప్ హాప్ తో అదరగొడుతూ షో ను రచ్చ చేస్తూ ఉంటుంది. తాజాగా అమెరికన్ మ్యూజిక్ అవార్డును గెలుచుకున్న రాజకుమారి భారతీయురాలే. అంతేకాదు తాను తెలుగమ్మాయి కూడా. రాజకుమారి అసలు పేరు శ్వేతా రావు. శ్వేత పుట్టకముందే తన పేరెంట్స్ అమెరికాలో సెటిలవడంతో తాను పుట్టి పెరగడం మొత్తం అక్కడే జరిగాయి. చదువు కూడా కాలిఫోర్నియాలోనే. అయితే అమెరికాలో ఉన్నప్పటికీ శ్వేతా ఫ్యామిలీ తెలుగు సంప్రదాయాన్ని వీడలేదు. ఐదేళ్ల వయసు నుంచే శాస్త్రీయ నృత్యంలో భాగంగా కూచిపూడి, భరతనాట్యం, కథక్ నేర్చుకుని దేశవిదేశాల్లో పెర్ఫార్మెన్సులు ఇచ్చింది. అమెరికాలోని హిప్ హాప్ గ్రూప్ ఫ్యూజీ చేసిన ది స్కోర్ ఆల్బమ్ చూసి ఇంట్రెస్ట్ తో తాను కూడా అది నేర్చుకుని 14 ఏళ్లకే హిప్ హాప్ డ్యాన్సర్ గా గుర్తింపు తెచ్చుకుంది. హిప్ హాప్ డ్యాన్సర్ గా కంటిన్యూ అవుతూనే ర్యాపర్ గా సాంగ్స్ రాసి పాడుతుంటే తన ఫ్రెండ్స్ విని ఎంజాయ్ చేస్తూ తనను ది ఇండియన్ ప్రిన్సెస్ అని పిలిచేవారట. దానికి తెలుగు అర్థం రాజకుమారి కాబట్టి, ర్యాపర్ గా మారాక తన పేరును కూడా రాజకుమారిగా మార్చుకుంది శ్వేతారావు. శ్వేతారావు పేరుతో సాంగ్స్ పాడితే ఆడియన్స్ కు ఇంట్రెస్ట్ ఉండదని, ర్యాపర్ రాజకుమారిగా పేరు మార్చుకుని, స్టేజ్ మీద పాట మధ్యలో అమ్మవారి స్టైల్ లో డ్యాన్స్ చేసి పేరుకు తగ్గ ర్యాపర్ గా గుర్తింపు తెచ్చుకుంది. ర్యాపర్ గా మారిన కొన్నాళ్లకే గ్రామీ అవార్డుకు నామినేట్ అవడంతో పాటూ బీఎమ్ఐ పాప్ అవార్డును కూడా అందుకుంది. ఎంటీవీ యూరోపియన్ మ్యూజిక్ అవార్డుకు మూడుసార్లు నామినేట్ అయిన రాజకుమారి గతేడాది ఆర్కేన్ లీగ్ ఆఫ్ లెజెండ్స్ సీజన్2 కోసం పాడిన రెనెగేడ్ సాంగ్ తో రీసెంట్ గా అమెరికన్ మ్యూజిక్ అవార్డును సొంతం చేసుకుంది. రాజకుమారి ఎంత అమెరికాలో పుట్టినప్పటికీ ఏటా హైదరాబాద్ వచ్చి కొన్నాళ్లపాటూ తన నాన్నమ్మ దగ్గర ఉండి వెళ్లేదట. అందుకే తన నాన్నమ్మ జ్ఞాపకార్థం పీస్ సాంగ్స్ చేసింది. చిన్నప్పట్నుంచి రాజకుమారికి రెహమాన్ సంగీతమన్నా, మాధురీ దీక్షిత్ నటనన్నా ఎంతో ఇష్టమట. రెహమాన్ సంగీతంలో దిల్ బేచారా సినిమాలో పాటతో ఆ కల నెరవేరడంతో పాటూ మాధురీతో మంచి బాండింగ్ కూడా ఏర్పడింది. 2017లో ముంబైకి చెందిన ర్యాపర్ డివైన్ తో కలిసి ఓ స్ట్రీట్ సాంగ్ తో ఇండియన మ్యూజిక్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రాజకుమారి రేస్3, జీరో, జడ్జిమెంటల్ హై క్యా సినిమాలను వర్క్ చేసింది. తెలుగులో వెంకటేష్ అటెన్షన్ ఎవ్రీబడీతో పాటూ ఉమెన్స్ డే కోసం ఐయామ్ రెబల్ సాంగ్ కూడా చేసింది. అంతేకాదు, మ్యూజిక్ ఇండస్ట్రీలో వివక్షను ఎదుర్కొంటున్న సింగర్స్ కోసం గాడ్‌మదర్ రికార్డ్స్ పేరుతో ఓ లేబుల్ ను ఏర్పాటు చేసిన రాజకుమారి జవాన్, బేబీ జాన్ సినిమాలకు కూడా పాడింది. తన ప్రతీ షో నుంచి వచ్చిన ఆదాయంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాజకుమారి, అందులో భాగంగానే బెంగుళూరు ఓ హాస్పిటల్ ను కట్టించడడంతో పాటూ హైదరాబాద్ లో దివ్యాంగ విద్యార్థుల కోసం ఓ ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.



# అన్నదమ్ములిద్దరు ఒకేసారి పాన్ ఇండియా!



టాలీవుడ్ బ్రదర్స్ విష్ణు-మనోజ్ గురించి పరిచయం అవసరం లేదు. కెరీర్ లో ఇద్దరు ఇంకా పీక్స్ కే చేర లేదు. సరైన సక్సస్ కోసం ఎదురు చూస్తున్నారు. విష్ణు హీరోగా కంటున్యూ అవుతుంటే? మనోజ్ మాత్రం కెరీర్ లో కొత్త టర్నింగ్ కూడా తీసుకున్నాడు. హీరో పాత్రలే కాకుండా మంచి పాత్రలొస్తే చేయాలని డిసైడ్ అయి ముందుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ‘మిరాయ్‘ అనే పాన్ ఇండియా చిత్రంలో ప్రతి నాయకుడిగా పాత్ర పోషిస్తున్నాడు.ఇప్పటికే రిలీజ్ అయిన మనోజ్ గెటప్ సహా ఇతర ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. చూ స్తుంటే మనోజ్ విలన్ గా క్లిక్ అయ్యేలా ఉన్నాడు. హీరో కంటే విలనిజం అతడిలో బాగా పండేలా కని పిస్తుంది. అతడి ఫిజిక్..వాయిస్ లో బేస్ లాంటి కొన్ని యూనిక్ క్వాలిటీలో మనోజ్ ను మంచి విలన్ ని చేసేలా ఉన్నాయి. ‘మిరాయ్‘ లో అతడి లుక్ చాలా ఇప్రెసివ్ గా ఉంది. కొత్తగా ట్రై చేసిన లుక్ పై పాజిటివ్ సైన్ పడుతుంది. సినిమాపై పాన్ ఇండియాలో మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. ఇదే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప ను ఎంత ప్రతిష్టాత్మకంగా భావించి చేసాడో చెప్పాల్సిన పనిలేదు. భారీ బడ్జెట్ తో నిర్మించిన చిత్రమిది. ఈసినిమాపై విష్ణు చాలా ఆశలు పెట్టుకున్నాడు. కొడితే కుంభ స్థలాన్నే కొట్టాలి అన్న కాన్సెప్ట్ తో బరిలోకి దిగుతున్నాడు. ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్ లాంటి టాప్ స్టార్లు కూడా సినిమాలో భాగమైన సంగతి తెలిసిందే. ఈ సినిమా కూడా ఇదే ఏడాది రిలీజ్ అవుతుంది. ఇలా ఒకే ఏడాది అన్నదమ్ములిద్దరు పాన్ ఇండియాలో పరిచయం కావడం విశేషం ఇదే తొలిసారి. ఇంత వరకూ ఇద్దరు కూడా పాన్ ఇండియా చిత్రాలు చేయ లేదు. దీంతో ఈ ఏడాది అన్నదమ్ములిద్దరికి కలిసొస్తుందని ఆశిద్దాం.






# పవన్ రాకపోవడం నిధికి కలిసొస్తుందా! ‘



‘హరిహరవీరమల్లు‘ ప్రచారం పనులు మొదలైన సంగతి తెలిసిందే. జూన్ 12న పాన్ ఇండియాలో రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ఉన్న సమయాన్ని టీమ్ అంతా ప్రచారానికే కేటాయిస్తుంది. అయితే ఈ ప్రచారం పనులన్నింటిలోనూ పవన్ పాల్గొనలేకపోతున్నారు. ఆయన బిజీ షెడ్యూల్ కారణంగా హాజరు కాలేక పోతున్నారు. ముంబైలో జరిగే ప్రెస్ మీట్తో పాటు మరో రెండు భారీ ఈవెంట్లకు మాత్రమే పీకే హాజరయ్యే అవకాశం ఉంది. అప్పటి వరకూ దర్శకు, నిర్మాత, హీరోయిన్, ఇతర నటీనటులతో ప్రచారం పనులు ముందుకు తీసుకె ళ్లాల్సిందే. దీనిలో భాగంగా హీరోయిన్ గా నటిస్తోన్న నిధి అగర్వాల్ మాత్రం ఎక్కడా మిస్ అవ్వడం లేదు. ప్రచారం పరంగా యూనిట్ కి అన్ని రకాలుగా మద్దతిస్తుంది. దర్శ, నిర్మాతల ఆదేశాల మేరకు నడుచు కుంటుంది. ఇది నిధి అగర్వాల్ కు వ్యక్తిగతంగానూ కలిసొస్తుంది. మీడియా సమావేశాల్లో ప్రధానంగా ఆమె హైలైట్ అవుతుంది. అదే పవన్ కళ్యాణ్ కూడా హాజరై ఉంటే నిధి ఫోకస్ అయ్యేది కాదు. కెమెరాలన్నీ పవన్ పై నే ఉంటాయి. స్పాట్ లో ఉన్నంత సేపు ఆయన మీదనే మీడియా ఫోకస్ ఉంటుంది. కానీ ఆయన లేకపోవడంతో ఆ ఫోకస్ అంతా నిధి అగర్వాల్ పై మళ్లిస్తున్నారు. ఈ క్రమంలో నిధి తనను తాను వ్యక్తిగతంగానూ ప్రమోట్ చేసుకుంది. అసలే అమ్మడికి సరైన పీఆర్ లేరు. అన్ని తానై పనిచేసుకోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో అన్ని ఉన్నా? అవకాశాలు అందుకోలేకపోవడానికి కారణం సరైన పీఆర్ లేకపోవడం కూడా చెప్పాలి. సోషల్ మీడియలో కూడా రేర్ గానే యాక్టివ్ గా ఉంటుంది. కానీ ఇప్పుడు వీరమల్లు ప్రచారంలో భాగంగా నిధి అగర్వాల్ ఎక్కువగా హైలైట్ అవుతుంది. వృత్తి..వ్యక్తిగతంగా తన మార్క్ వేసే ప్రయత్నం చేస్తుంది.

# పార్టీలో మూడు కుంపట్లు..



హైదరాబాద్, మే 30, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మౌనం ఇప్పుడు అనేక ప్రశ్నలకు దారి తీస్తోంది. ఆయన నిర్ణయాల్లోని ఊగిసలాట, స్పష్టత లేకపోవడం వల్ల పార్టీ శ్రేణులు మూడు గ్రూపులుగా విడిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు, కూతురు కవిత – ఈ ముగ్గురికీ పార్టీలో సొంత బలగాలున్నాయి. నిజానికి, ఈ మూడు శక్తులు కలిసికట్టుగా ఉంటేనే బీఆర్ఎస్ బలంగా ఉ ంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కొని పార్టీని పటిష్టపరచాల్సిన సమయంలో, అంతర్గత గ్రూపు రాజకీయాలతో బీఆర్ఎస్ బలహీనపడుతోందిఇటీవలే కవిత రాసిన ఒక లేఖ బహిర్గతం కావడంతో పార్టీలోని విభేదాలు రచ్చకెక్కాయి. బీఆర్ఎస్ లో ఏదో జరుగుతోందనే వార్తలు, కథనాలు మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. పార్టీలో ఈ విభేదాలను నిలువరించడం పార్టీ పెద్దగా కేసీఆర్ కే సాధ్యం. ఆయన చొరవ తీసుకుంటేనే ఈ పరిస్థితికి ముగింపు పడుతుంది. లేదంటే, ఈ అంతర్గత కలహాలు పార్టీని పూర్తిగా ముంచే ప్రమాదం ఉంది.అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం తర్వాత పార్టీ గాడి తప్పినట్లు, అంతర్గత లుకలుకలు బయటపడినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబ సభ్యుల మధ్యనే ఆధిపత్య పోరు నడుస్తుండడంతో పార్టీలోని కీలక నేతలతో సహా కార్యకర్తలు అయోమయంలో పడిపోయారు. కవిత రాసిన లేఖ ఈ గ్రూపు తగాదాలకు కొత్త మలుపునిచ్చింది. కవిత అమెరికా పర్యటనకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో నాటకీయంగా ఈ లేఖ లీక్ కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ లీకు వెనుక ఎవరున్నారనేది పక్కన పెడితే, అసలు కవిత పార్టీకి సంబంధించిన అంశాలపై లేఖ రాయాల్సినంత తీవ్రమైన పరిస్థితులు బీఆర్ఎస్ లో ఏర్పడ్డాయనేదే ఇక్కడ కీలకం. ఈ లేఖ తానే రాశానని కవిత స్వయంగా అంగీకరించడం పార్టీలో విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో తెలియజేస్తోంది.పార్టీ బలోపేతం కోసమే తాను ఈ లేఖ రాశానని కవిత చెప్పినప్పటికీ, దీనికి మీడియాలో, సోషల్ మీడియాలో లభించినంత విస్తృతమైన చర్చ క్షేత్రస్థాయిలో జరగలేదు. ప్రజలు కూడా ఇదంతా ఒక కుటుంబ డ్రామాగానే ఉందని, కేసీఆర్ జోక్యం చేసుకుంటే అంతా సమిసిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో కూడా కవితకు ఆశించిన మద్దతు లభించలేదు. ఈ లేఖ వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయనే అభిప్రాయం బీఆర్ఎస్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.ఎయిర్‌పోర్ట్‌లో కవిత విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని చెప్పడంపై పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో 'కవిత సీఎం సీఎం' అంటూ ఆమె అనుచరులు చేసిన నినాదాలను కవిత వారించి ఉంటే, ఆమె కేసీఆర్‌ను ధిక్కరించలేదనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో కలిగి, ఆమెకు కొంత మద్దతు లభించేది.బీఆర్ఎస్ లో కేటీఆర్, కవిత, హరీశ్ మధ్య ఆధిపత్య పోరుపై భిన్నమైన అభిప్రాయాలున్నాయి. కేటీఆర్ ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండడంతో పార్టీలో ఆయనది ప్రత్యేక స్థానం. ఇదే సమయంలో పార్టీలో హరీశ్ రావుకు కూడా కీలక ప్రాధాన్యతే ఉంది. ఉద్యమ సమయం నుంచి పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న హరీశ్ రావుపై ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉ ంది. పార్టీలో కుటుంబ సభ్యుల మధ్యే పోరు నడుస్తుండడంతో కేసీఆర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.హరీశ్ బలమేంటో, తనయుడి బలహీనత ఏంటో బాగా తెలిసిన కేసీఆర్ కొడుకు కేటీఆర్ ను ఒక మెట్టు ఎక్కించడానికి, మేనల్లుడు హరీశ్ ను ఒక మెట్టు దించే ప్రయత్నాలు గతంలో అనేకసార్లు చేశారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ విజయం సాధించిన తర్వాత హరీశ్ కి మంత్రి పదవి ఇవ్వకుండా దూరం పెట్టారు. దీంతో ఆయన సిద్దిపేటకే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఏకపక్షంగా కేటీఆర్ కి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టారు.అప్పుడు కూడా కేటీఆర్ నాయకత్వంలో పని చేయడానికి తాను సిద్ధమని హరీశ్ తన విధేయతను ప్రకటించారు. అనంతరం ఇంటా బయట తీవ్ర ఒత్తిడి రావడంతో హరీశ్ కి మంత్రి పదవి ఇచ్చినా... అంతకు ముందు నీటిపారుదల మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్న హరీశ్ కు ఆ శాఖ కాకుండా ఆరోగ్య శాఖ బాధ్యతలు ఇచ్చారు. పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరున్న హరీశ్ కు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఇతర ఉప ఎన్నికల్లో ప్రాధాన్యత తగ్గించడంతో అప్పుడు బీఆర్ఎస్ బలహీనపడగా, బీజేపీ బలపడింది. కవిత ఎదురు తిరగడానికి అనేక కారణాలున్నాయి. తనను లిక్కర్ కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరెస్టు చేస్తే కేసీఆర్ ఆ పార్టీపై వెనకడుగు వేస్తున్నారనే అభిప్రాయం కవితలో ఏర్పడింది. రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీపై తేలికపాటి విమర్శలు చేయడం వల్ల పార్టీపై ప్రజల్లో అనుమానాలు పెరిగాయని ఆమె తండ్రికి రాసిన లేఖలో చెప్పడానికి ఇదే ప్రధాన కారణం. రాజకీయంగా బీజేపీ కోసం తనను బలిపశువు చేశారనే ఆగ్రహం ఆమెలో ఉంది.

# తెలంగాణ కాంగ్రెస్‌ను లైట్ తీసుకుంటున్న అధిష్ఠానం

హైదరాబాద్, మే 30, దేశంలో బిజెపి జోరును తట్టుకుని మూడే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అందులోనూ తెలంగాణలో మరే ఇతర పార్టీలతో పొత్తు లేకుండా రేవంత్ ప్రభుత్వం ఏర్పడింది. కూటమి కుంపట్లకు దూరంగా తెలంగాణలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇప్పుడు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేవంత్ పగ్గాలు చేపట్టిన తరువాత ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు,గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కానీ ఆ పథకాల నుంటి ఆశించిన స్దాయిలో అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికిక మైలేజ్ పొందలేక పోయారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారంణం క్షేత్రస్థాయిలో పార్టీకి బ్రాండ్ అంబాసిడర్లుగా చెప్పుకునే పిసిసి కార్యవర్గమే ఇంకా ఏర్పాటు కాలేదు. పిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకుని తొమ్మిది నెలలు దాటినా, నేటికీ క్షేత్రస్థాయిలో కమిటీల నియామకం జరగలేదు. అలా అని తప్పు రాష్ట్ర పార్టీదా అంటే కాదు, ఇక్కడ లైట్లు వెలగాలంటే అక్కడ స్విచ్ నొక్కాలి. అలా ఢిల్లీలో స్విచ్ ఆన్ చేయించేందుకు హైదరాబాద్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి ఛీఫ్ అనేక సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోవాల్సిన పరిస్థితులొచ్చాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారనే స్థాయిలో పరిస్థితులు చేరాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పిసిసి కార్యవర్గంలో తమకూ చోటు దక్కుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నవారి లిస్ట్ చాంతాడంత ఉంది. అయితే అందులో ఇప్పటికే వడపోతల తరువాత ఒక్కో పదవికి మూడు పేర్లు చప్పున లిస్ట్ సిద్దం చేసింది పిసిసి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రేపో మాపో పదవులు ప్రకటన రాబోతుందని కోటి ఆశలు పెట్టుకున్నవారు ఇప్పుడు నీరసించి విసిగిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నా కనీసం ప్రచార కమిటీ నియామకం కూడా జరగలేదు. ఆర్టీసీ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్లు వంటి రాష్ట్ర స్దాయి పదవుల నుంచి మార్కెటింగ్ కమిటీ చైర్మెన్లు, లైబ్రరీ చైర్మన్లు ఇలా నామిటేడెట్ పోస్టుల ఊసేలేదు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచి టూ జెడ్ పీ చైర్మన్ వరకూ ఏ ఒక్కరి పేర్లు ఖరారు చేయలేదు. సిఎం రేవంత్ రెడ్డితోపాటు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సైతం అనేకసార్లు ఢిల్లీ పెద్దలను కలిసేందుకు వెళ్లారు. పిసిసి కార్యవర్గం లిస్ట్‌కు ఆమోదం కోసం అందుబాటులో ఉన్న పెద్దలను కలిసినా ఫలితం లేదు. ఇంకా స్విచ్ నొక్కాలంటే సమయం పడుతుందని ఢిల్లీ నుంచి వెనక్కి పంపేశారు. రేవంత్ రెడ్డి సిఎం పదవి చేపట్టి ఏడాదిన్నర దాటినా, మంత్రివర్గ విస్తరణ మాత్రం అతి పెద్ద టాస్క్‌గా మారింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినప్పుడు పడ్డ కష్టాలకంటే మంత్రివర్గ విస్తరణ కోసం పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న అవమానాలే ఎక్కువైయ్యాయనే టాక్ నడుస్తోంది. తెలంగాణ క్యాబినెట్‌లో మొత్తం 18 మంత్రి పదవులకుగానీ సిఎంతో కలపి మొత్తం 12 మంత్రి పదవులు భర్తీ అయ్యాయి. మరో ఆరు శాఖలు ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహుల లిస్ట్ తో ఢిల్లీ చుట్టూ సిఎం రేవంత్ రెడ్డి ఎక్కే ఫ్లైట్, దిగే ఫ్లైట్ అంటూ ఎంత తిరిగినా అధిష్ఠానం పెద్దల నుంచి రేవంత్ లిస్ట్‌కు ఆమోదం దొరకలేదు. తాజాగా ఖర్గే అందుబాటులో లేరని వెనక్కు పంపించేశారు. గతంలో వెళ్లినా రాహుల్ ఉంటే కేసీ వేణుగోపాల్ ఉండరు, వాళ్లిద్దరూ ఉంటే మరొకరు ఉండరు. ఇప్పటికే ప్రతిపక్షాలు రేవంత్ ఢిల్లీ పర్యటనపై సెటైర్లు వేస్తూ ఓ రేంజ్ లో మాటల తూటాలు పేలుస్తు?న్నారు. వారి మాటలకు మరింత బలం చేకూరేలా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలూ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విపిస్తున్నాయి. ఈ పరిణామాలు చూస్తుంటే, తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే పదేళ్ల పాటు పార్టీ కోసం శ్రమించి, తీరా అధికారంలోకి వచ్చినా ఆశించిన పదవులు అందకపోవడంతో కింది స్థాయి క్యాడర్ లో నిస్తేజం నెలకొటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. ప్రతీ సినిమా మొదలయ్యే ముందు వచ్చే ఈ మాటలు విని ఎంత మంది పొగ మానేస్తారో అర్థం కాదు. పొగ తాగడం వల్ల హానికరం అని తెలిసి కూడా మానలేకపోతున్నవారు చాలామందే ఉన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని మే 31న ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది.1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. పొగాకు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయడంకోసం అవగహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారతదేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గింది.




# వివాదంలో సినిమా అవార్డులు

హైదరాబాద్, మే 30, తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంది. గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటిస్తూ.. 'పుష్ప 2' హీరో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా పురస్కారం ఇవ్వడంపై బీజేపీ కాంగ్రెస్‌ను ఎండగడుతోంది. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ఉన్న సినిమాను విమర్శిస్తూనే.. మరోవైపు అదే వ్యక్తికి అవార్డు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తోంది. ఇది కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణలో రాజకీయ విమర్శలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా.. తెలంగాణ బీజేపీ తన సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో అవార్డులను ప్రకటించింది. ఈ పురస్కారాల్లో భాగంగా, 'పుష్ప 2' సినిమా హీరోగా చేసిన అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు వరించింది. అయితే.. ఈ నిర్ణయంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా బీజేపీ నుండి పరోక్ష విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నిజానికి, 'పుష్ప' సినిమాలో పోలీసులు, ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా హీరో వ్యవహరించడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గతంలో తీవ్ర విమర్శలు చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పాత్రలను ప్రోత్సహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన సంధ్యా థియేటర్ ఘటనలో కూడా అల్లు అర్జున్ తీరుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు గుప్పించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా సాహసం చేసిన పాత్రకు అవార్డు ఇవ్వడం, అంతేకాకుండా పోలీసుల ఊచకోతకు కారణమైన నక్సల్ నేపథ్యం ఉన్న గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటించడంపై బీజేపీ పరోక్షంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.బీజేపీ తెలంగాణ తన సోషల్ మీడియా ఖాతాలో "రంగు రంగుల జండాలు మార్చిన రంగోలి రేవంత్ నాయకత్వంలో... అసలు రంగు కాంగ్రెస్ నాయకులు మర్చిపోయినట్టున్నారు" అంటూ వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. దీని ద్వారా.. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ప్రచారం చేసే సినిమాలను, వ్యక్తులను విమర్శిస్తూనే, మరోవైపు అటువంటి వారికి అవార్డులు ఇవ్వడం, గతంలో నక్సల్ ఉద్యమ నేపథ్యం ఉన్న వారికి పురస్కారాలు ప్రకటించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తుందని బీజేపీ పరోక్షంగా ఆరోపిస్తోంది. ఇది తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.ఈ విమర్శలకు మరింత పదును పెడుతూ.. 'పోలీసులపై ఇంత ప్రేమ ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు... అదే పోలీసుల ఊచకోతకు కారణమైన గద్దర్ పేరును ఉత్తమ అవార్డులకు పెడతారు' అని బీజేపీ ఆరోపించింది. అమాయక ప్రజల, పోలీసుల ప్రాణాలను కబళించే నక్సలైట్లను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులే అడ్డుపడతారని బీజేపీ మండిపడింది.అంతా మీ ఇష్టమేనా.. మీరే విమర్శించి.. మీరే అవార్డులు ఇస్తారా'.. సంచలన పోస్ట్ వైరల్..కల్పిత పాత్ర అయిన పోలీసును సినిమాలో అవమానిస్తే బాధపడుతున్న మంత్రి అనసూయ (సీతక్క), నిజ జీవితంలో పోలీసులను ఊచకోత కోసిన నక్సలైట్లకు శ్రద్ధాంజలి ఘటిస్తారని, వారి ఆశయ సాధనకు పాటు పడతామని అనడం విడ్డూరమన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కపట బుద్ధిని చూపుతుందని.. 'ఊసరవెల్లి కూడా ఉరేసుకుంటుంది' అని బీజేపీ ఎద్దేవా చేసింది. నక్సలిజంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న వైరుధ్యపూరిత వైఖరిని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## సీజనల్ వ్యాధులు విస్తరించే ప్రమాదం..



వరంగల్ , మే 30, తెలంగాణలో వానల తీవ్రత పెరిగిన నేపథ్యంలో.. వైద్య ఆరోగ్య సంస్థలు ప్రజలను వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. ముమ్మందు భారీ వానలు కురుస్తాయనే నివేదికల దృష్ట్యా.. వ్యాధుల విస్తరణ నిరోధానికి పలు నిర్దేశాలు చేశారు. దోమ తెరల వాడకం, నీటి నిలువ తొలగించడం, శుద్ధి చేసిన నీటిని తాగడం, బహిరంగ ఆహారాలు నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటివి ముఖ్యమని పేర్కొన్నారు. జ్వరం, దగ్గు వంటి అనారోగ్య లక్షణాలున్న వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించాలని.. అత్యవసరాలలో 108కి డయల్ చేయాలని సూచించారుతెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలంగాణ ప్రజా వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలియజేసింది.వర్షాకాలంలో సాధారణంగా పెరిగే దోమల బెడదను నివారించడం అత్యంత ముఖ్యం. దీని కోసం, ఇళ్లలోని తలుపులు, కిటికీలకు మస్కిటో నెట్‌లను అమర్చుకోవడం ద్వారా దోమల ప్రవేశాన్ని అరికట్టవచ్చని వైద్య శాఖ సూచించింది. అంతేకాకుండా, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇళ్ల పరిసరాల్లోని నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉ త్పత్తిని నియంత్రించవచ్చు. ఈ చర్యలు డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తాయి.ఇక.. తాగునీటి విషయంలో కూడా అప్రమత్తత అవసరం. ఫిల్టర్ చేసిన లేదా కాచి వడగట్టిన నీటిని మాత్రమే తాగాలని ఆరోగ్య శాఖ నొక్కి చెప్పింది. బయటి ఆహార పదార్థాలను తినడం మానుకోవాలని, వాటి వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలుప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. తరచుగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. గాలి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల నివారణకు, జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలున్న వారికి దూరంగా ఉండాలి. ఒకరినొకరు కలుసుకునేటప్పుడు చేతులు కలపడం వంటివి తగ్గించుకోవాలి. ఒకవేళ అలా చేస్తే, తప్పనిసరిగా శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.ఎవరికైనా దగ్గు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి వంటి సీజనల్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చాలని వైద్య శాఖ విజ్ఞప్తి చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 108కి కాల్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కేంద్రాలు అన్ని రకాల వైద్య సదుపాయాలతో, సిబ్బందితో సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరింది. వర్షాకాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే, ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## వేములవాడలో రాజన్న కోడెల మృతి కలకలం

రాజన్న సిరిసిల్ల మే 30, వేములవాడలో రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందడం కలకలం రేపుతున్నాయి. తిప్పాపురం గోశాలలో 8 కోడెలు మృతి చెందాయి. రాజన్న కోడెల మృతితో సర్వత్రా ఆందోళన నెలకొంది. గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉండడంతో మృత్యువాత పడుతున్నాయి. 400 ఉ ండాల్సిన గోశాలలో ఉన్న 1200 కోడెలు వున్నాయని సమాచారం. పరిమితికి మించి ఉన్న కోడెలు ఊపిరాడక, పోట్లాటతో అనారోగ్యంపాలై మృత్యువాత పడుతున్నాయి. రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా ఇవ్వాలనే అధికారుల నిర్ణయం పక్కదారి పట్టడంతో కోడెలు పంపిణీకి బ్రేక్ పడింది. కోడెల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దైవభక్తితో భక్తులు సమర్పించే రాజన్న కోడెలు మృత్యువాత పడడం ఆందోళనకరం.

## రియల్ ఎస్టేట్ పేరుతో విదేశీయులకే కుచ్చు టోపి

శ్రీ సత్య సాయి,మే 30, పుట్టపర్తిలో సత్యనారాయణ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ పేరుతో విదేశీయులు నమ్మించి మోసం చేసాడు. సత్య సాయిబాబా భక్తులైన విదేశీయులే టార్గెట్ గా పావులు కదిపాడు. వివిధ దేశాలకు చెందిన పలువురు భక్తులతో దాదాపు 70 కోట్లకు చెందిన ఆస్తులను కొల్లగొట్టాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ కి చెందినఅర్విన్ ఫ్రాన్సిన్ ఈనెల 22వ తేదీన సత్యనారాయణకు భూములు కొనుగోలు చేస్తానని చెప్పడంతో ఎనిమిది కోట్ల రూపాయలు తన అకౌంట్ ద్వారా ట్రాన్స్ఫర్ చేశానని.... కొన్ని భూములు కొనుగోలు చేయకుండా తనను మోసం చేసినట్లు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసాడు. మరో ఇద్దరు యు ఎస్ కి చెందిన బాధితుల సైతం సత్యసాయి జిల్లా ఎస్పీ రత్నకు ఫిర్యాదు చేసారు. దీంతో సత్యనారాయణ ను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు, బ్యాంకు ద్వారా పెద్ద మొత్తంలో సత్యనారాయణ అకౌంటుకు ట్రాన్స్ఫర్ అయినట్లు గుర్తించారు. సత్యనారాయణ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పుట్టపర్తి లో ఇంత పెద్ద మొత్తంలో విదేశీయులు మోసగించిన సత్యనారాయణ పై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా 70 కోట్ల వరకు ట్రాన్సాక్షన్స్ జరిగినట్టు సత్యసాయి జిల్లా పోలీసులు గుర్తించారు. పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ వివరాలను వెల్లడించారు. విదేశీయులు చెందిన మరి కొంతమంది బాధితులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్టు సమాచారం

## కడపలో జరిగిన మహానాడు అట్టర్ ప్లాప్ : శ్రీకాంత్ రెడ్డి

కడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు అట్టర్ ఫ్లాప్‌గా మిగిలిపోయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడానికే మహానాడు పరిమితమైందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఏం మంచి చేశారో చెప్పుకోలేని అసమర్థ ముఖ్యమంత్రి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. గత అయిదేళ్ళ పాలనలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన విశ్వసనీయత వైఎస్ జగన్‌దేనని అన్నారు.

# వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం



ఆముదాల వలస(విజయ సారథి):స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాఖ సమన్వయంతో బూర్జమండలం ఉప్పెన వలస గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఖరీఫ్ పంట కాలంలో రైతులు పాటించాల్సిన అంశాలైన విత్తన రకాల ఎంపిక వాటి లభ్యత వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ కె కృష్ణం నాయుడు గ్రామంలో రైతులు యొక్క వ్యవసాయ, ఉద్యాన పంటలలో సమస్యలు, సందేహాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ పరిశోధన, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు రైతులు యొక్క సమస్యలు పై ముఖాముఖి చర్చించారు. కేంద్రీయ పరిశోధనా స్థానం నుంచి వచ్చిన శైలజ వ్యవసాయంలో యువత ముందుకు రావాలని కోరారు, ఉద్యాన పంటల్లో వచ్చేటటువంటి చీడపీడల గురించి మరియు ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల గురించి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పి అశోక్, పెద్దపేట, మరియు ఉద్యాన అధికారి అయంతి రైతులకు వివరించారు. అనంతరం గోగు పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ శ్రీనివాస కట్టే జనుము పంటల గురించి రైతులు ముందుకు రావాలని కోరారు. బూర్జ మండల ప్రజలు కృషి విజ్ఞాన కేంద్రం యొక్క సేవలు వినియోగించుకోవాలని, వరి పండించే రైతులు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు గురించి, కృషి విజ్ఞాన కేంద్రం యందు అందుబాటులో ఉన్నటువంటి వరి విత్తనాలు, వరాలు విత్తనాలు నూతన రకాలను రైతులు వినియోగించుకోవాలని మరియు మహిళలు యువత కె.వికె అందించే శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యాపారవేత్తలుగా మారాలని డాక్టర్ ఎస్ అనూష సస్యరక్షణ శాస్త్రవేత్త తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గన్నె రాజు, తెలుగు దేశ పార్టీ నాయకులు ఇచ్చే వాసుదేవ్, డి వెంకటరమణ, స్థానిక రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి దిలీపు మత్స్య శాఖ నుంచి అధికారులు పాల్గొని ఆ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం దగ్గరలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ రైతు క్షేత్రాన్ని సందర్శించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా ఉంటున్నాం:రాష్ట్ర మంత్రి టీజీ భరత్

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్



కర్నూలు(విజయ సారథి):ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. పోదూరి లలిత అనే మహిళకు రూ.1,48,327, దినేష్ కుమార్ కు రూ.2,64,008, సయ్యద్ అంజాద్ బాషా కు రూ.45,700, పూజారి జయలక్ష్మి అనే మహిళకు రూ.15000లు చెక్కులను మంత్రి టీజీ భరత్ అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్ ల మేలు మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

## పహల్గాం ఉగ్రదాడి బాధితులకు అండగా నిలుస్తాం

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు తాము పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో బాధిత కుటుంబాలను హోం మంత్రి కలుసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాక్ షెల్లింగ్ దాడుల్లో దెబ్బతిన్న, మృతిచెందిన బాధిత కుటుంబాలకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ, జనావాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులు జరపడం గర్హనీయమని అన్నారు. బాధిత కుటుంబాలకు ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తమ ప్రియతములను పోగొట్టుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగమో, పరిహారమో భర్తీ చేయలేదని, అయితే వారి కుటుంబాలకు ప్రభుత్వం, ప్రజల సంఘీభావంగా ఉంటుందని, యావద్దేశం అండగా నిలుస్తుందని చెప్పారు. పూంచ్ పౌరులు, అధికారులు చూపించిన సాహసం, దేశభక్తి యవద్దేశానికి స్ఫూర్తినిస్తుందని ప్రశంసించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య అని, ఏ ఒక్క ఉగ్రవాద చర్యను ఉపేక్షించరాదన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ విధాన నిర్ణయమని చెప్పారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, ప్రజలు బలంగా కోరుకోవడం, ప్రధానమంత్రి నిర్ణయాత్మక నాయకత్వం, విలువైన ఇంటెలిజెన్స్ సమాచారం, భారత సాయుధ బలగాల అసమాన ప్రతిభ వల్లే అత్యంత భీకర దాడులు జరపగలిగామని అమిత్‌షా అన్నారు.

# పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

**:టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం కావాలి**

**:ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి**

**:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



కర్నూలు(విజయ సారథి):పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువు లోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్ లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు సంబంధించి 09 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఈ ఈ ని ఆదేశించారు..టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు..ల్యాండ్ లెవెలింగ్, ముళ్ళ పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపీఎంఐపీ పిడి కలెక్టర్ కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవర బండ గ్రామంలో 10 ఎకరాలను కేటాయించడం జరిగిందని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.బనవాసి టెక్స్టైల్ పార్కు లో త్వరితగతిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.అలాగే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు.ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కి నీటి సరఫరా పైపు లైన్ నిర్మాణపు పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీఐఐసీ జడ్ఎం ను అడిగి తెలుసుకున్నారు.70 శాతం పూర్తి అయ్యాయని జడ్ఎం కలెక్టర్ కు వివరించారు. జూలై లోపు పైప్ లైన్ నిర్మాణపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.దూపాడు - బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లు భూసేకరణ చేయాలని కలెక్టర్ ఏపీఐఐసీ జడ్ఎం ను ఆదేశించారు.రైల్వే లైన్, నీటి పైప్ లైన్, ఎయిర్ పోర్టు లు పరిశ్రమలకు కనెక్ట్ అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు..జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్ కో తదితర కంపెనీ ల ద్వారా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎం ను ఆదేశించారు.. ఇందుకు సంబంధించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పీఎం విశ్వకర్మ పథ కానికి సంబంధించి 2135 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, వీటి మంజూరు ప్రగతికి సంబంధించి చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇండస్ట్రీస్ జిఎం ను ఆదేశించారు..కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి ఎస్టిమేట్స్ వేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..రూ.1.61 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదంపరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24 క్లెయిమ్ లకు రూ.1.61 కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ క్రింద 17 క్లెయిమ్స్ కు రూ. 1,57,50,166/- , వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్ కు రూ. 13,813/-, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ క్రింద ఒక క్లెయిమ్ కు సంబంధించి రూ 36,663/-, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ క్రింద 5 క్లెయిమ్స్ కు సంబంధించి రూ.3,35,265/- లు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలపడం జరిగిందన్నారు.కేటగిరీల వారీగా జనరల్ కేటగిరీ లకు 7, ఎస్సీ లకు 15, ఎస్ టి లకు 2 మొత్తంగా 24 మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు.సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్చార్జి జిఎం అరుణ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ఏపీ ఎంఐపీ పిడి ఉమా దేవి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ ఈ కిషోర్ కుమార్ రెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యోగా తో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

**:డిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి**

**నగరము లోని హౌసింగ్ బోర్డు అభయ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణం లో యోగాంధ్ర కార్యక్రమం 10 రోజు నిర్వహణ**



అనంతపురం(విజయ సారథి):నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి తెలిపారు. శుక్రవారం ఉదయం అనంతపురం నగరము హౌసింగ్ బోర్డు లోని అభయాంజనేయ దేవాలయం ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి యం హెచ్ ఓ,హౌసింగ్ పిడి శైలజ,ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, డా.భాస్కర్, డా లాల్యా నాయక్ ,యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజా, డెమో త్యాగరాజ్ , డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ ,వైద్య మరియు హౌసింగ్ శాఖల అధికారులు, పతాంజలి సంస్థ రవి కుమార్ , వారి సిబ్బంది, వివేకానంద సంస్థ రాజశేఖర్ రెడ్డి , బ్రహ్మకుమారీ శారద ,హౌసింగ్ బోర్డు ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా డి యం హెచ్ ఓ మాట్లాడుతూ నగర ప్రజలు అందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ యోగ చేయడం వల్ల ఎంతటి రోగాలనైనా మన శరీరం తట్టుకుంటుందని, మనమందరం ఆరోగ్యంగా ఉండి మన కుటుంబాన్ని పోషించుకోగల మనో ధైర్యం, సంకల్పం ఇలాంటి యోగాతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఉదయం గంట సేపు మన శరీరాన్ని యోగ వైపు మరలించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కి, అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ కి ఆమె ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివేకానంద యోగ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు



నంద్యాల(విజయ సారథి):రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.గతంలో రెన్యువల్ చేసిన అక్రిడేషన్ కాల పరిమితి మే 31వ తేదీ నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి(విజయ సారథి):నైరుతి రుతుపవనాలు ముందుగా వస్తున్నందున విరివిగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో విరివిగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని జిల్లా యంత్రాంగం అప్రమత్తముగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులుతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించి అన్ని శాఖల జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరాలలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను మరియు టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువు, కాలువ గట్లను సమన్వయంతో ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ వారు అన్ని వైద్య ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది వైద్య అధికారులు, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉంటూ కావలసిన వైద్య పరికరాలను మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పోలీస్, అగ్నిమాపక శాఖ, జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ, రెవెన్యూ గ్రామ పంచాయతీ ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది వర్షాకాల నేపథ్యంలో నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్ (ఏపీ ఈపీడీసీఎల్), రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. గత ఏడాది రోడ్డు పైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం రుతుపవనాలు రానున్న సందర్భంగా పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని , జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వైపు వర్ష కాలం వస్తున్నది మంచి విషయమే అయినప్పటికీ కాని, దాని వలన వచ్చే ఉరుములు, మెరుపులు వలన ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. అలాగే పశువులకు కూడా అలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్నవారికి వర్షాలు ఎక్కువగా రానున్నరీత్యా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ఆహార పదార్థాలు, త్రాగు నీరు, మౌలిక సదుపాయాలను సంబందిత అధికారులు కల్పించాలని ఆదేశించారు. వర్షాలు రానున్న నేపద్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డివిజన్ స్థాయిలో ఆర్డిఓలు, మండల స్థాయిలో తహసీల్దార్ లు, ఎంపిడిఓ లు, గ్రామ స్థాయిలో పంచాయతీ అధికారులు ఎలాంటి విపత్తులు జరగకుండా పూర్తి బాద్యత తీసుకోవాలన్నారు. వర్షా కాలంలో పాఠశాలలు ప్రారంభవుతున్న సందర్భంగా పాత బడిన సంక్షేమ వసతి గృహాలలో వున్నా మరమ్మతులను అన్నిటిని పూర్తి చేసిన తరువాత పిల్లలను అందులో ఉండేటట్లు చూడాలని సంక్షేమ వసతి గృహాల అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో ఆర్డిఓ లు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట తిరుపతి, భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, రాంమోహన్, తిరుపతి డిఎస్పి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ లు, డిపిఓ సుశీలా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో, డిఎంహెచ్ఓ,సీపీఓ, ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు, ఎస్సీ బీసీ ఎస్టీ ఐసిడిఎస్ వెల్ఫేర్ అధికారులు, ఫైర్, మత్స్యశాఖ, తాసిల్దార్లు, ఎంపీడీవోలు,సంబందిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com